కర్నూలు | నంద్యాల
వార్త
7 అక్టోబర్ 2025 మంగళవారం పేజీలు 4

# పత్తికొండ మార్కెట్‌ను తనిఖీ చేసిన.. విజిలెన్స్ అధికారులు

**పత్తికొండ, అక్టోబరు 6, ప్రభాతవార్త:**
పత్తికొండలో టమోటా రైతులకు గిట్టుబాటు ధరలేక టమోటాలను రైతులు రోడ్డుపై పారబోసి నిరసన వ్యక్తం చేసిన సంధర్భంగా ఎస్పీ చైడదేశ్వరీదేవి ఆదేశాల మేరకు సోమవారం పత్తికొండ మార్కెట్‌ను కడప రీజినల్ అధికారి లావణ్య మార్కెట్‌ను సంధర్శించి టమోటాల ధరలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్న వానల వల్ల టమోటా నాణ్యతను బట్టి ట్రేడింగ్ ధర రైతులకు అంధించే విధంగా చర్యలు తీసుకుంటామని, నాణ్యత ఉన్న సరుకులు రూ.8లు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. వ్యాపారస్తులు సిండికెట్‌గా ఏర్పడి రైతులను దెబ్బతీస్తున్నారా అనే విషయం అడిగి తెలుసుకున్నారు. అలాంటి వారు ఎవరైన ఉంటే లైసెన్స్ రద్దు చేస్తామని ఆమె హెచ్చరించారు. అనంతరం కర్నూలు విజిలెన్స్ డిపార్మెంట్ అధికారులు తనిఖీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు కార్యదర్శి కార్నల్స్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతి..

**: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత..**
**: కర్నూలులో రాష్ట్రస్థాయి జయంత్యోత్సవం ..**
**: తరలిరానున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు**

**కర్నూలు అక్టోబర్ 06 ప్రభాతవార్త ప్రతినిధి :**
నేడు (07అక్టోబర్) మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నారు. కర్నూలులో రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవం నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది నుంచి మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయిస్తూ ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందన్నారు. అక్టోబర్ ఏడో తేదీన మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ కలెక్టర్ల నేతృత్వంలో వాల్మీకి జయింతిని నిర్వహించనున్నామన్నారు. కర్నూలులో రాష్ట్ర స్థాయి వాల్మీకి జయంత్యోత్సవాన్ని చేపట్టనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మంత్రి టీజీ భరత్ సహా పలువురు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని యువగళం పాదయాత్రలో మంత్రి లోకేశ్‌కు అప్పట్లో భారీ సంఖ్యలో వినతులు అందాయన్నారు. ఈ నేపథ్యంలో బీసీల ఆత్మగౌరవానికి ప్రాముఖ్యతనిస్తూ, ఇచ్చిన హామీని నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతిని నిర్వహించాలని నిర్ణయం తీసుకుందని మంత్రి సవిత ఆ ప్రకటనలో తెలిపారు



# అదే వైఫల్యం..అదే హింస..!

- "బన్నీ" లో భద్రత డొల్ల..
- బన్నీ ఉత్సవంలో హింస అరికట్టాలి
- భద్రత విషయంలో పోలీసుల వైఫల్యం
- ఉత్సవ విధానంలో మార్పులు తేవాలి
- దేవరగట్టు బన్నీ ఉత్సవంపై పీజీఆర్ఎస్ లో ఫిర్యాదు

**దేవరగట్టు బన్నీ ఉత్సవంకు హిందూ సంప్రదాయంలో ప్రత్యేక స్థానం ఉంది. రెండు రాష్ట్రాలకు చెందిన భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి, అమ్మవార్ల ఉత్సవం మూర్తుల కోసం పోటీ పడతారు. అక్కడ జరిగే గాయాలు కానీ.. చివరకు ప్రాణాలు పోయిన లెక్కచేయని పరిస్థితి. అలాంటి ఉత్సవంలో హింసను నివారిస్తే ఉత్సవానికి మరింత వన్నె వస్తుందనడంలో సందేహం లేదు. ఆ ఉత్సవంలో కర్రల సమరంలో పోలీసులు భద్రత నిబంధనలు పాటిస్తే సరిపోతుంది. మరి ప్రతి సంవత్సరము అక్కడ ప్రాణాలు పోతున్నా.. కర్రలు లేకుండా చేయడంలో కానీ.. కర్రలకు ఇనుప రింగులు లేకుండా చేయడంలో గాని పోలీసుల విఫలమవుతూనే ఉన్నారు. తాజాగా సోమవారం నాటి ప్రజా ఫిర్యాదుల విభాగంలో బన్నీ ఉత్సవ నిర్వహకులపై కేసు నమోదు చేయాలని అక్కడివారు ఫిర్యాదు చేశారు.**



**కర్నూలు, అక్టోబర్ 06, ప్రభాతవార్త :**
దేవరగట్టు ఉత్సవ నిర్వహణకు 800 మంది పోలీసులు వెళ్లారు. మరి వారు చేపట్టిన భద్రత ఎక్కడ.. అనే ప్రశ్న బహిరంగంగా వినిపిస్తోంది. గతంలో లాగానే మరణాలు తప్పలేదు.. గాయాలు తప్పలేదు.. మరి ఎనిమిది వందల మంది పోలీసుల భద్రత చేసిందేమిటి.. అనే ప్రశ్నకు సరైన సమాధానం లేదు. ఏది ఏమైనా ఉత్సవం జరగాలన్నది అందరి ఆకాంక్ష.. అయితే అందులో హింస నివారించాలనేది ప్రతి ఒక్కరి కోరిక. హింస నివారించాలంటే పోలీసుల భద్రత చర్యలే ప్రధానం. ఉత్సవానికి ముందు నుంచి అధికారులు పర్యటించి కౌన్సిలింగ్ చేశామన్నారు.. కర్రల కోసం గాలించామన్నారు.. బైండోవర్ కేసులు అన్నారు.. నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు... జిల్లా ఎస్పీ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉత్సవం నిర్వహించామన్నారు. కానీ నష్టం ఏమైనా తగ్గిందా.. అంటే ఏమీ లేదని చెప్పవచ్చు. ఈ విషయంపై ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. జరిగిన ప్రాణ నష్టంపై ఆలయ నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ఆధ్వర్యంలోని పీజీ ఆర్ఎస్ లో ఫిర్యాదు చేశారు. ఇదంతా భద్రత వైఫల్యం అనడంలో సందేహం లేదు.

ప్రతి ఏడాది రింగుల కర్రలు.. రింగుల కర్రలు.. అంటూ గగ్గోలు పెడతారు. సదరు రింగుల కర్రలను అరికట్టడంలో ప్రతి ఏటా పోలీసులు విఫలమవుతూనే ఉన్నారు. మరి అక్కడ ఉన్న స్పెషల్ బ్రాంచ్ కానీ.. ఇంటెలిజెన్స్ కానీ.. పోలీస్ స్టేషన్ క్రైమ్ పార్టీ కానీ... సచివాలయ పోలీసులు.. ఇతర సిబ్బంది కానీ.. ఎవరు కూడా రింగుల కర్రల వచ్చే మార్గాన్ని కనిపెట్టలేకపోయారు. కనీస సమాచారం కూడా అందుకోలేకపోయారు. ఉత్సవం జరగాల్సిందే కానీ అందులో హింసకు కారణమైన రింగుల కర్రలను నివారిస్తే సగం నష్టం నివారించినట్లే... అన్నింటిని మించి సీసీ కెమెరాల పర్యవేక్షణ పెట్టారు.. ఎవరు కొట్టారు.. ఎవరు చనిపోయారు.. ఏమి జరిగింది అనే విషయం స్పష్టంగా సీసీ కెమెరాలలో ఉంటుంది. మరి ఆ విషయాలపై..

• వివరాలు 2లో

**పి జి ఆర్ ఎస్ లో ఫిర్యాదు..**
బన్నీ ఉత్సవంలో హింస జరగడంపై ఆలయ ట్రస్ట్ కమిటీపై కేసు నమోదు చేయాలని ఆలూరుకు చెందిన ఎం చంద్రశేఖర్ పిజిఆర్ఎస్ లో ఫిర్యాదు చేశారు. ఇలాంటి హింస ప్రతి సంవత్సరం జరుగుతున్నప్పటికీ ఆ ఉత్సవానికి అనుమతులు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించాడు. ఉత్సవంలో జరిగే హింసకు బాధ్యత ఎవరు వహిస్తారని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం జరిగిన మరణాలు, గాయాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని చంద్రశేఖర్ డిమాండ్ చేశారు.



# టమోటా రైతులకు అండగా ఉంటాం..

**: రైతులు ఆందోళన చెందొద్దని హామీ ఇచ్చిన మంత్రి అచ్చెన్నాయుడు**



**కర్నూలు అక్టోబర్ 6 ప్రభాతవార్త ప్రతినిధి:**
రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టమోటా ధరలపై రైతులకు భరోసా ఇచ్చారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తిన పుడు, రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు. ఆదివారం రాప్తాడు మార్కెట్‌లో టమోటా ధరలు గరిష్టం రూ.18, కనిష్టం రూ.9, మోడల్ ధర రూ.12గా ఉన్నాయి. 30-40 మెట్రిక్ టన్నుల సరుకు పత్తికొండ మార్కెట్‌కు వస్తుందని, దసరా సెలవుల కారణంగా 10 టన్నులు అదనంగా చేరినట్లు, రోడ్లపై 2వ గ్రేడ్ క్వాలిటీ టమాటాలు వేసి గందరగోళం సృష్టించబడినట్లు మంత్రి వివరించారు. ఇప్పటివరకు 10 మెట్రిక్ టన్నుల టమోటాలను వివిధ రైతు బజార్లకు పంపించామని, ఈ రోజు పత్తికొండ మార్కెట్ నుంచి 10 మెట్రిక్ టన్నులు చిత్తూరు ప్రొసెసింగ్ యూనిట్‌కు, 15 మెట్రిక్ టన్నులు రైతు బజార్లకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రకు సరుకు వర్షాల కారణంగా తగ్గిన నేపథ్యంలో, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల టమాటా అమ్మకాలు మందగించాయని మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. ప్రస్తుతం టమాటాలకు ట్రెండింగ్ ధర బట్టి రైతులకు మంచి ధర లభిస్తోంది. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులను ఆదుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు.

# బోయ రత్నాకరుడే.. మహర్షి వాల్మీకి..!



**ఎమ్మిగనూరు క్రైం, అక్టోబర్ 06 ప్రభాతవార్త:**
త్రేతాయుగంలో గంగా తీరంలోని నైమిషారణ్యంలో అనేక మంది మునులు ఆశ్రమాలు నిర్మించుకుని నిష్టతో తపస్సు చేస్తుండేవాళ్ల. వీరిలో ప్రచస్థాముడు అనే ముని కుమారుడు రత్నాకరుడు. ఒకరోజు అడవిలో ఆడుకుంటూ దారితప్పి ఎటుపోవాలో తెలియక భయంతో ఏడుస్తున్న రత్నాకరుడిని అటుగా వెళ్తున్న ప్రయాణిస్తున్న ఓ వేటగాడు గమనించాడు. ఆ ముని కుమారుడిని ఓదార్చి తనతో పాటు తీసుకెళ్లిన బోయవాడు తన కుమారునిగా పెంచుకుంటాడు. తన కుమారుడు అడవిలో ఏ క్రూర మృగాల బారినో పడి మరణించి ఉంటాడని ప్రచస్థాముడు భావిస్తాడు. బోయవారి ఇంట పెరిగిన రత్నాకరుడు విలువిద్యలో ప్రావీణ్యం సంపాదిస్తాడు. యుక్త వయస్సుకు వచ్చిన రత్నాకరుడికి ఓ యువతితో వివాహమవుతుంది. వీరికి ముగ్గురు సంతానం. వీరితోపాటు తల్లిదండ్రులను పోషించడానికి సంపాదన చాలక దారి దోపిడీలు, దొంగతనాలను వృత్తిగా చేసుకుని కొన్ని సందర్భాల్లో బాటసారులను చంపడానికి వెనుకాడని పరిస్థితికి చేరుకుంటాడు రత్నాకరుడు. అడవిలో బాటసారుల కోసం ఎదురుచూస్తున్న సమయంలో నారద మహర్షి ఓ సాధారణ మనిషి రూపంలో ఆ దారి వెంట వస్తాడు. ఆయనను దోచుకోడానికి రత్నాకరుడు ప్రయత్నించగా..తన వద్ద వీణ, రుద్రాక్షలు, కాషాయ వస్త్రాలు తప్ప ఏమీ లేవన్నా వినిపించుకోకుండా చంపుతానంటూ భయపెడుతాడు. నీవు ఇన్ని పాపకార్యాలు ఎవరికోసం చేస్తున్నావని నారదుడు ప్రశ్నించగా తన కుటుంబం కోసమని రత్నాకరుడు బదులిస్తాడు. పోషణ కోసం తెలిసిన విద్య ఇది ఒక్కటే..పాప పుణ్యాలు నాకు తెలియవని అంటాడు. రత్నాకరుడికి జ్ఞానోదయం కలిగించేందుకు నారదుడు ఓ ఉపాయం పన్నుతాడు. ఓ బోయవాడా..నీవు చేసే ఈ పాపాల్లో నీ కుటుంబ సభ్యులు ఎవరైనా భాగం పంచుకుంటారేమో అడిగి తెలుసుకోమని తనతో పాటు ఇంటికి వెళ్తాడు. తన పాపాల్లో మీరూ కూడా భాగస్వాములే కదా అని తల్లిదండ్రులు, భార్య బిడ్డలను ప్రశ్నించగా, అందుకు వారు సమ్మతించరు. పైగా కుటుంబ పోషణ ఇంటి యజమాని బాధ్యత..పాప,పుణ్యాలు ఒకరి నుంచి ఇంకొరికి ఇవ్వలేం, తీసుకోలేమని బదులిస్తారు. వారి మాటలతో పశ్చాత్తాపం చెందిన రత్నాకరుడు పాపవిముక్తి కలిగించాలని నారదుని వేడుకుంటాడు. అప్పుడు నారదుడు తన నిజస్వరూపాన్ని చూపి భక్తి మార్గానికి రామ..రామ అనే రెండుక్షరాల మంత్రాన్ని ఉపదేశిస్తాడు. అప్పటి నుంచి నైమిషారణ్యంలో రామ మంత్రాన్ని జపిస్తూ కొన్నేళ్లు తపస్సుచేస్తాడు. తపస్సులో కూర్చున్న రత్నాకరుడి చుట్టూ పుట్టలు వెలుస్తాయి..అలా కొనేళ్లు గడిచిన తర్వాత పుట్టలో బక్క చిక్కి బయట ప్రపంచంతో సంబంధం లేని రత్నాకరుని చెవిలో రామ..రామ..రామ అని నారదుడు మూడు సార్లు పలుకుతాడు. ఆ తారక మంత్రాన్ని విన్నంతనే రత్నాకరుడు తపస్సునుంచి బయటకు వస్తాడు. ఆ తర్వాత వాల్మీకి మహర్షి సంస్కృతంలో రామాయణ సంకలనం చేస్తాడు. సంస్కృతంలో రాసిన మొదటి కావ్యం కావడంతో రామయాణాన్ని ఆదికావ్యం అంటారు. ఇకపోతే వాల్మీకి మొదటి శిష్యులు రాముడి కుమారులైన లవకుశలు.

**-నేడే వాలీ ్మకి జయంతి..! :** అక్టోబర్ 07వ తేది మంగళవారం ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి రోజు వాల్మీకి జయంతి జరుపుకోవాలని పంచాంగ కర్తలు సూచిస్తున్నారు. ఈ రోజు శ్రీరామ నామ జపం చేయడం, రామాయణ పారాయణ చేయడం ద్వారా శ్రీ వాల్మీకి మహర్షి అనుగ్రహంతో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందవచ్చునని పెద్దలు, పండితులు చెబుతున్నారు. వాల్మీకి జయంతి రోజు ఆ మహానుభావుని జీవిత విశేషాలు తెలుసుకొని, ఒక ఆదర్శ గురువుగా ఆయన చూపిన మార్గంలో నడవడమే ఆ మహర్షికి మనం ఇచ్చే నిజమైన గురు దక్షిణ.

# ప్రధాని పర్యటన.. విజయవంతం చేయాలి

**: రాష్ట్ర మంత్రులుఏర్పాట్లపై సమీక్ష.. స్థల పరిశీలన**



**కర్నూలు, అక్టోబర్ 7, ప్రభాతవార్త :**
ప్రధానమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, బీసీ జనార్ధన్ రెడ్డి, టీజీ భరత్ ఆదేశించారు. సోమవారం కర్నూలు నగరంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఈనెల 16న జరిగే ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లపై మంత్రులు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ..జిల్లాలో ప్రధానమంత్రి పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, మూడు లక్షల మందితో బహిరంగ సభను విజయవంతంగా నిర్వహించాలి," అని అధికారులను ఆదేశించారు. జీఎస్టీ సంస్కరణలు, జిల్లా అభివృద్ధి అంశాలపై ప్రధాని సభలో వివరించనున్నారని చెప్పారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, "పర్యటన విజయవంతం అయ్యేలా వేదిక, బస్సుల ఏర్పాటు, ప్రజా రవాణా వంటి అంశాలపై పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి," అని సూచించారు. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ..ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖలు రోడ్ల కనెక్టివిటీ మెరుగుపరచేలా తక్షణ చర్యలు చేపట్టాలి," అని అన్నారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ..గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి లోపాలు లేకుండా సభను విజయవంతంగా నిర్వహించాలి," అని అధికారులకు సూచించారు. ప్రధాని కార్యక్రమం స్పెషల్ ఆఫీసర్ వీర పాండియన్, ఐఏఎస్ మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు సమన్వయంతో పర్యటనను విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ఆదోని ఎమ్మెల్యే డా. పార్థసారథి సభ విజయవంతం చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. బస్సుల పార్కింగ్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ప్రధాని పర్యటన ఏర్పాట్లపై వివరాలు సమర్పించారు. తదనంతరం గుట్టపాడు, రాగమయూరి, నన్నూరు టోల్‌ప్లాజా ప్రాంతాల్లో సభ నిర్వహణకు వీలును మంత్రులు, అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎంఎల్సీలు బీటీయస్ నాయుడు, బీద రవిచంద్ర, ఎస్పీలు విక్రాంత్ పాటిల్, సునీల్ షెరాన్, ఎమ్మెల్యేలు కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి, కే.ఈ. శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, టిటిడి బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ నాగేశ్వర యాదవ్, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, సిఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తుదారులు సమర్పించిన అర్జీలను.. మందుగా చదువండి

**నంద్యాల, అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి**
సమస్యలను పరిస్కరించాలని జిల్లా నలుమూలల నుండి ఎంతో ప్రయాస పడి వచ్చిన మీకు అందించిన అర్జీలను ముందుగా క్షుణంగా చదివి వాటికి పరిస్కాము చూపాలని .జిల్లా కలెక్టరు జి.రాజకుమారి జిల్లా స్థాయి అదికారులను అదేశించారు. సోమవారము నంద్యాల కలెక్టరేట్‌లోని పిజిఅర్‌యస్ హాల్లో ప్రజాసమస్యల పరిస్కర వేదిక కార్యక్రమం నిర్వహించారు.ఇందులో డిఅర్‌ఓ రామునాయక్ డిప్యుటి కలెక్టర్లు, జిల్లా స్థాయి అన్ని శాఖల అదికారులు పాల్గొన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టరు మాట్లాడుతూ అర్జిదారులు సమస్యలను మనకు చెప్పడానికి జిల్లా నలుమూలల నుండి ఎంతో ప్రయాస పడి వచ్చి అర్జిలను సమర్పించినప్పుడు మనమువాటిని ముందుకు చదివి అందులో ఏముంది సమస్యల ఎక్కడ నుండి వచ్చింది. ఎలా పరిస్కరించాలని అర్జిలపై ముందుగా అవగాహణ కల్పించుకుంటే దాని పరిస్కారము చాలా సులువుగా ఉంటుందని చెప్పారు. ప్రతి అర్జిని జాగ్రత్తగా,చదివి అందులో పేర్కొన్న అంశాలను కూలంషంగా పరిశీలించి సరిఅయిన రీతిలో పరిస్కరించాల్సిన బాద్యత మన మీద ఉందని అమె స్పష్టము చేశారు. ప్రస్తుతము నిర్ణీత కాలవ్యవదిలో పరిష్కరించాల్సిన 2017 రీ ఓపన్ అయిన దరఖాస్తులు 539 ఉన్నాయని గుడవు ముగిసే వరకు వేచి చూడకుండా వెంటనే పరిస్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ఫీడ్బ్యాక్ స్వీకరణ తక్కువ శాతము ఉందని వేగవంతము చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని సంబందిత మండల స్థాయి తహశీలుదారులను అదేశించారు.అన్ని సంక్షేమ హాస్టళ్ల స్త్రీ శిశు సంరక్షణ కేంద్రాల్లో మౌళిక వసతుల సదుపాయాలకల్పలపై సంబందిత క్షేత్రాదికారులు తనికీలు నిర్వహించి సంబందిత ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టరు అదేశించారు.సాంఘిక సంక్షేమ హాస్టళ్లు,బిసి సంక్షేమహస్టళ్లలో తనికీలు నిర్వహిస్తూ లోపాలపై ప్రత్యేక శ్రర్ద తీసుకోని ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరు అదేశించారు.



**పిజిఅర్‌యస్‌ద్వారా స్వీకరించిన కొన్ని సమస్యలు:**
గోస్పాడు మండలం యం.చింతకుంట్ల గ్రామానికి చెందిన చింకుంట వెంకటేశ్వర్లకు ర్వే నెంబరు 247, 232లో ఉన్న ఒక సెంటు భూమిని గత కొన్ని సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నానని సదురు భూమి అన్‌లైన్ ఎక్కించాలని కోరుతూ అర్జి సమర్పించారు.
అళ్లగడ్డ మండలం జి.జంబులదిన్నె గ్రామానికి చెందిన బి.శ్రీరామ్‌కు సర్వే నెంబరు 328నఎ2లో రెండు ఎకరాలు సర్వేనెంబరు 328నబొలో ఎకరాలు సాగు చేసుకుంటూ జీవనము సాగిస్తున్నానని కాని అన్‌లైన్ లో . ఎకరాలు మాత్రమే చూపుతోందని అందుకు తగు చర్యలు తీసుకోవాలని అర్జి సమర్పించారు
ఈకార్యక్రమంలో మొత్తం 222మంది అర్జీదారులు తమ సమస్యలను పరిస్కరించాలని దరఖాస్తులు సమర్పించారు. అన్ని అర్జిలు నిర్ణీత గడువులోగా పరిస్కరించేందుకు అదికారులు ఎండార్సు చూస్తు డిఅర్‌ఓ జారీ చేశారు.

# చట్టపరంగా న్యాయం చేస్తాం.. : జిల్లా ఎస్పీ

**కర్నూలు, అక్టోబర్ 6, ప్రభాతవార్త :**
ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం కర్నూలు కొత్తపేటలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులతో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ రోజు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 58 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ"ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదుపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తాం. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటాం" అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



# మట్టి మిద్దె కూలి.. బాలిక మృతి..!

**- నేలమట్టమైన మిద్దె, గొర్రె కూడా మృతి**
**- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న బాధితులు**
**- కేసు నమోదు చేసిన పోలీసులు**



**మంత్రాలయం, అక్టోబరు06, ప్రభాతవార్త;**
మండల పరిధిలోని మాధవరం గ్రామంలో ఘోరం జరిగింది. ఓ మట్టిమిద్దె కూలిన సంఎఘనలో ఓ బాలికతో పాటు గొర్రె మృతిచెందగా మిద్దె నేల మట్టమయ్యింది. బాలిక మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. వివరల మేరకు గ్రామానికి చెందిన నాగలదిన్నె భీమరాయ అనే తన కుమార్తె అయిన మహేశ్వరిని గొనెగండ్ల మండలం గంజల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులకు ఇచ్చి వివాహం జరిపించారు. ఈ దంపతులకు లలిత(5) అనే కుమార్తె ఉంది. ఈ బాలికల వారి తాత గారి వద్ద ఉంటూ రచ్చుమర్రి గ్రామంలో ఉన్న వెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నర్సరీ చదువుతోంది. వారి కుటుంబ సభ్యులు కలిసి మట్టిమిద్దె అయిన ఇంట్లో నిద్రించగా గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి మిద్దె పూర్తిగా నానడంతో రాత్రి సమయంలో మిద్దె ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఈ సంఘటనలో బాలిక మట్టిలో కూరుకుపోయింది. స్థానికులు గమనించి బాలికను రక్షించే ప్రయత్నం చేశారు. వెంటనే బాలికను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే బాలిక అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. బాలికతో పాటు ఓ గొర్రె కూడా మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ రమాదేవి ఆదేశాల మేరకు ఆర్ఐ జనార్ధన్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. ఎస్ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతిచెందిన బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# జిఎస్టీ తగ్గింపుతో పేద ప్రజలకు లబ్ది

**– కెసికెనాల్ ఛైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి**

**బండిఆత్మకూరు, అక్టోబర్ 6, ప్రభాతవార్తః** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన జిఎస్టీ తగ్గింపుతో పేదలకు, బడుగు బలహీనవర్గాలకు మేలు జరుగుతుందని కెసి కెనాల్ ఛైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, టిడిపి మండల అధ్య క్షులు ముమ్మడి నాగకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దదేవులాపురం గ్రామంలో సూపర్ జిఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామానికి వచ్చిన కెసికెనాల్ ఛైర్మన్, టిడిపి మండల అధ్యక్షులను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్బంగా కెసికెనాల్ ఛైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి మాట్లాడుతూ మధ్యతరగతి వినియోగదారులు కొనుగోలు చేసే 375 రకాల ఉత్పత్తులపై పన్నురేట్లు తగ్గించడం వల్ల వినియోగదారులకు కొంత ఊరట లభించిందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఇవ్వని హామీలను కూడ అమలుచేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే ఆటో డ్రైవర్లసేవలో పథకం ద్వారా ఆటో కారి ్మకులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు తమ ఖాతాలో జమచేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో మహిళల సంక్షేమం కోసం ఉచిత గ్యాస సిలిండర్లు, స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు పథకం, తల్లికి వందనం, పెన్షన్ల పెంపు, మెగా డిఎస్సీ ఒక్కొక్కటిగా నేరవేస్తున్నారని తెలిపారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు మండలానికి



రూ.4 కోట్ల నిధులు కేటాయించారన్నారు. రెండు పంటలకు సాగునీరు అందించిన ఘనత ఎమ్మెల్యేకు దక్కుతుందని రైతు కష్టాలు తెలిసిన రైతుబిడ్డ అన్నారు. ఆయన అన్ని సామాజికవర్గాలు అండగా నిలవాలని కోరారు. అనంతరం సూపర్ జిఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో జి పరమటూరు సహకార సంఘం చైర్మన్ సాయిబాబా రెడ్డి, టిడిపి ఎస్టీ జిల్లా అధ్యక్షులు కృష్ణ నాయక్, బీసీ పార్లమెంటు కన్వీనర్ శివప్రసాద్, గ్రామ అధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, టిడిపి నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అదే వైఫల్యం..అదే హింస..!

**(మొదటి పేజీ తరువాయి )** : చట్టపరమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. చట్టపరంగా చర్యలు ఉంటాయంటే.. హింస తగ్గుతుంది అనడంలో సందేహం లేదు. చివరకు మృతుల కుటుంబాలను జిల్లా ఉన్న అధికారులు పరామర్శించలేదని విమర్శలు గుప్పుమంటున్నాయ్. బాధిత కుటుంబాలను ఓదార్చడంతో పాటు, ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించాల్సిన అవసరం ఉందని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. బన్నీ ఉత్సవంలో భక్తులు రెండు వర్గాలుగా విడిపోయి, చేతిలో కర్రలతో "బన్నీ" కొట్టుకుంటారు. ఈ సంప్రదాయం కాలక్రమంలో హింసాత్మక రూపం దాల్చింది. ప్రతి సంవత్సరం లక్షల మంది పాల్గొనడం, మద్యం మత్తులో పోరాటం జరగడం, నియంత్రణ లేని గుంపులు ఏర్పడటం కారణంగా వందలాది గాయలు, మరణాలు నమోదు అవుతుంటాయి. అయినా సరైన భద్రతా చర్యలు, నియంత్రణ విధానాలు అమల్లోకి రావడం లేదు. ఈ ఉత్సవంలో చనిపోయిన వారి కుటుంబాలు ఇప్పటికీ న్యాయం కోసం ఎదురుచూస్తున్నాయి. మరణాలపై సరైన కేసులు నమోదు చేయడం లేదని, బాధితులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి నష్టపరిహారం అందడం లేదని వాపోతున్నారు."ప్రతి ఏడాది మేము ఎవరో ఒకరిని కోల్పోతున్నాం, కానీ అధికారులు ఏం చేయడం లేదు" అని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం ఈ ఉత్సవం తర్వాత గాయపడిన వారు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతారు. ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలు నిశ్శబ్దంగా శోకంలో మునిగిపోతాయి. ప్రభుత్వాలు మాత్రం ఆ వేదనను పట్టించుకోకుండా తదుపరి సంవత్సరం కూడా అదే పద్ధతిలో ఉత్సవం కొనసాగించేందుకు అనుమతిస్తాయి. ప్రజా సంఘాలు ఈ పరిస్థితిపై తీవ్రంగా స్పందిస్తున్నాయి. సాంస్కృతిక సంప్రదాయాన్ని కాపాడుకోవడం అవసరం కానీ ప్రాణాలు పోకుండా, హింస లేకుండా జరపడం మరింత ముఖ్యం. ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించి, ఈ ఉత్సవాన్ని శాంతియుతంగా మార్చాలి" అని సామాజికవేత్తలు, మానవ హక్కుల కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

# కౌతాళం క్లస్టర్ పరిధిలోని పాఠశాలలకు అవార్డులు

**కౌతాళం, అక్టోబరు06, ప్రభాతవార్త;** కౌతాళం క్లస్టర్ పరిధిలో ఉన్న ఎంపీపీ కన్నడ స్కూల్, కౌతాళం (జీపీ మరియు మండల్) స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్-2025 డిస్టిక్ బెస్ట్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల హెచ్ఎం బి.పి.త్రివేణి, వారి సిబ్బందికి అభినందనలు



తెలియ జేశారు. కర్నూలులో ప్రశంసా సర్టిఫికెట్‌ను అందజేస్తూ మంత్రి టీజీ భరత్ అభినందించారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించి, చైతన్యం తీసుకురావాలని మంత్రి సూచించినట్లు హెచ్ఎం తెలిపారు.

# పంట కోత ప్రయోగంపై అవగాహన

**మంత్రాలయం, అక్టోబరు06, ప్రభాతవార్త;** నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలో వీఏఏలు, వీహెచ్ఏలకు పంట కోత ప్రయోగంపై అవగాహన కార్యక్రమం నిర్వమిం చారు. మండల వ్యవసాయ అధికారి జీరా గణేష్, ఏఎస్ఓ సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని రైతులు సాగుచేసిన వరి, పత్తి



పంట కోతలపై వివరించారు. వరి పంట సాగుచేసిన రైతులకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. ఆన్‌లైన్ పంట నమోదును వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్మంలో ఏఈఓ తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

# దేశంలో ఎన్నికల ప్రక్రియను బిజెపి అపహాస్యం చేస్తోంది

**నందికొట్కూరు,అక్టోబరు 6,ప్రభాతవార్త:** దేశంలో ఎన్నికల ప్రక్రియను బారతీయ జనతా పార్టీ అపహాస్యం చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గం ఇన్‌చార్జ్ తేనే నాగరాజు తెలిపారు. సోమవారం పట్టణంలోని టౌన్ బ్యాంక్, పాత బస్టాండు ప్రాంతం



లో దొంగ ఓట్లతో గద్దెనెక్కిన బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దిగాలని ఇంటింటికి తిరిగి ప్రజలచే సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతు ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశ మైన భారత దేశంలో అత్యంత భాధ్యతతో నిర్వహించాల్సిన ఎన్నికల ప్రక్రియను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన అధికార దాహంతో అపహాస్యపాలు చేసిందని ఆయన విమర్శించారు. నంద్యాల జిల్లా డిసిసి ఉపాధ్యాక్షులెఉ షేక్ ఉస్మాన్‌బాష, పబ్బతి శ్రీరామ్,జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న గౌడ్, జిల్లా నాయకులు సికింధర్, మద్దిలేటి, మనోహార్, అంబటి శ్రీనువాసులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా వేలం పాటలు

**గడివేముల, అక్టోబరు 6, ప్రభాతవార్త;** స్థానిక శ్రీ దుర్గా భోగేశ్వరస్వామి దేవస్థానంలో టెంకాయలు అమ్ముకునేందుకు, టీ, మిఠాయి అమ్ము కునేందుకు బహిరంగ వేలం పాటలను సోమవారం దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.ఎల్.ఎన్.రామా నుజన్, పర్యవేక్షణ అధికారి పి.హరిచంద్రరెడ్డి, ఛైర్మన్ కంది శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహిం చారు. టెంకాయలు అమ్ముకునే హక్కు ఒక



సంవత్సరానికి రూ.2,15,000 సి.కృష్ణుడు అనే పాటదారుడు దక్కించుకున్నాడు. అలాగే టీ, మిఠాయి అంగడి ఒక్క సంవత్సరానికై రూ.32 వేలకు కె.రామయ్య అనే పాటదారుడు వేలం పాట ద్వారా దక్కించుకున్నాడు. ఈ వేలం పాటల ద్వారా గత సంవత్సరం కంటే రూ.4 వేలు అదనంగా ఆదాయం వచ్చినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.ఎల్.ఎన్.రామానుజన్ తెలిపారు. పాటదారులు దేవస్థాన నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# తప్పిపోయిన పద్మవిద్యావికాస్ విద్యార్థి

**వెల్దుర్తి, అక్టోబర్ 6, ప్రభాతవార్త :** మండలంలోని మదార్‌పురం గ్రామానికి చెందిన అశోక్ కుమారుడు సాయిభరత్ వెల్దుర్తి పట్టణంలోని పద్మవిద్యావికాస్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు.రోజువారిలాగే తల్లితండ్రులు సోమవారం బడికి వెళ్లమని చెప్పి పంపారు.అదే గ్రామానికి చెందిన అతను వెల్దుర్తికి బైక్‌పై వస్తుండగా పంపారు. అతను ఆ విద్యార్థిని వెల్దుర్తి సిహెచ్‌సి వద్ద పాఠశాలకు సమీపంలో దింపాడు. అయితే ఆ విద్యార్థి సాయంకాలం ఇంటికి



రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లితండ్రులు స్కూల్ హెచ్ఎంను అడిగారు.మీ పిల్లాడు బడికి రాలేదని చెప్పాడు.తాము బడికి పంపామని బడికి రాక ఇంటికి రాక ఎక్కడికి వెళ్లాడో అని మదార్‌పురంలో,వెల్దుర్తిలో వారు వెతికారు. ఎంతకు కనపడకపోయే సరికి వెల్దుర్తి పోలీసులను ఆశ్రయించారు.

# వెల్దుర్తిలో జిఎస్టీపై అవగాహన

**వెల్దుర్తి, అక్టోబర్ 6, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన వెల్దుర్తిలో జిఎస్టీపై పలు వ్యాపార ప్రాంగణాల్లో కర్నూలు డివిజన్ జిఎస్టీ అధికారి పి.రమేష్‌బాబు బృందంతో కలిసి అవగాహన కల్పించారు.ఈ సంద ర్భంగా జిఎస్టీ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం జిఎస్టీ రేట్లను తగ్గించడం ద్వార



కలుగుతున్న ప్రయోజనాలపై వివరించారు.జిఎస్టీ రేట్లను తగ్గించడంతో నెలవారి ఖర్చులు ఎంత వరకు తగ్గుతాయో కరపత్రాలను పంచారు. ఈనెల19 వరకు నిర్వహిస్తున్నామన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలకు స్వచ్ఛంధ్ర అవార్డులు

**బండిఆత్మకూరు, అక్టోబర్ 6, ప్రభాతవార్తః** బండిఆత్మకూరు అంగన్‌వాడీ-3,కాకనూరు అంగన్‌వాడీ-2లకు స్వర్ణంధ్ర,స్వచ్ఛంధ్ర ఉత్తమ అవార్డులు లభించాయి. సోమవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా చేతుల మీదుగా అంగన్‌వాడీ కార్యకర్తలు అవార్డులను అందుకున్నారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# గోవర్దనగిరిలో వాల్మీకి విగ్రహా ప్రతిష్టకై రానున్న ప్రముఖులు

**వెల్దుర్తి, అక్టోబర్ 6, ప్రభాతవార్త :** మండలంలోని గోవర్దనగిరి గ్రామానికి ఈనెల8న గ్రామంలో ఏర్పాటుచేసిన వాల్మీకి మహర్షి విగ్రహా ప్రతిష్టకు ప్రముఖులు రానున్నారని ఆ గ్రామ వాల్మీకులు తెలిపారు.ఈ సందర్బంగా వారు సోమవారం వెల్దుర్తిలో వాల్మీకి సంక్షేమసంఘం మండల అధ్యక్షులు వి.యం.గోపినాథ్‌నాయుడుతో కలిసి వారు మాట్లాడారు.గుంతకల్,పత్తికొండ,ఆదోని ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, కెఇ శ్యాంబాబు, పార్థసారథి, ఎమ్మెల్సీలు బిటి.నాయుడు, వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మెన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ,



కర్నూలు మేయర్ బి.వై.రామయ్యతో పాటు పలువురు వాల్మీకి పెద్దలు హాజరవుతు న్నారన్నారు. వాల్మీకి సోదరులంతా ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

# గుంటుపల్లి గ్రామాన్ని కొత్త పంచాయతీగా ఏర్పాటుచేయాలి

**వెల్దుర్తి, అక్టోబర్ 6, ప్రభాతవార్త :** మండలంలోని సూదేపల్లి గ్రామపంచాయతీ మజారా గ్రామమైన గుంటుపల్లి గ్రామాన్ని కొత్త పంచాయతీగా ఏర్పాటుచేయాలని గుంటుపల్లి గ్రామ తెదేపా నాయకులు ఈదుల వెంకటరాముడు,గ్రామస్తులు కోరుతున్నారు.ఈ సందర్బంగా సోమవారం వారు మండల తహశీల్దార్ చంద్రశేఖర్‌వర్మ,ఎంపిడిఓ



సుహాసినమ్మకు వినతిపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ సూదేపల్లి గ్రామపంచాయతీలో 3400 మంది ఓటర్లు ఉన్నారని గుంటుపల్లి గ్రామంలో దాదాపు 804 మంది ఓటర్లు ఉండగా తాము ఓటు వేసేందుకు సూదేపల్లి గ్రామానికి 6 కిలోమీటర్లు రావాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలో పార్టీల వారు పెట్టే వాహనాలను ఎక్కి ఓటేయ్యలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు.ఇదే విషయాన్ని జిల్లాకలెక్టర్,డిపిఓ,ఎంపిడిఓకు విన్నవించుకున్నా మన్నారు.అయితే పరిశీలించడానికి సైతం తమ గ్రామం నోచుకోలేదన్నారు.మా గ్రామానికి వచ్చే నిధులు రావడం లేదని దీంతో తమ గ్రామం అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు.ఇప్పటికైనా జిల్లాఅధికారులు స్పందించి మా గ్రామాన్ని సూదేపల్లి గ్రామపంచాయతీ నుంచి వేరుచేసి కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయాలన్నారు. తెదేపా నాయకులు ఈదుల వెంకటరాముడు, వెంకటేశ్వరమ్మ, వెంకటసాయిరెడ్డి, రాంబాబు, శేషమ్మ, రంగస్వామి, అయ్యన్న, క్రిష్ణయ్య, రాజశేఖర్, పాల్గొన్నారు.

# అధిక వర్షాలు వల్ల పంట నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలి

**ఆదోని రూరల్, అక్టోబర్ 06, ప్రభాతవార్త :** మండలంలో గత రెండు నెలలుగా కుడుస్తున్న అధికారులు వల్ల పత్తి వేరుశనగ ఉల్లి టమోటా మిర్చి లాంటి పంటలు పూర్తిగా దెబ్బతిని తీవ్రమైన నష్టం జరిగిందని కావున ప్రభుత్వం వెంటనే నష్టాన్ని అందించినవేసి రైతులకు పంట నష్టపరిహారం అందజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం



ఆధ్వర్యంలో ఆదోని తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ ధర్నాను ఉద్దేశించి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు మాట్లాడుతూ రైతులు వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంట అధిక వర్షానికి దెబ్బతిని దిగుబడి వచ్చే పరిస్థితి లేదని అందుకోసం రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని ఆయన అన్నారు.ఇంత వర్షాలు కురిసి నష్టం జరుగుతున్న ప్రభుత్వం అధికారులు మాత్రం ఇప్పటివరకు పంట నష్టాన్ని అంచనా వేయకపోవడం దారుణమని అన్నారు.వచ్చిన అరకోర పంటకు కూడా గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు క్వింటాలుకు 8150 రూపాయలుకు పత్తిని కొనుగోలు చేయాల్సి ఉన్న 6వేలకు మించి పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఉల్లి రైతులకు కూడా పంటవేసిన రైతులందరికీ పరిహారం ఇవ్వాలని ఎకరాకు 50వేల రూపాయలు పంట నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. 2023.24 సంబంధించిన పంట నష్ట పరిహారం మూడు కోట్ల రూపాయలు బకాయిలు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలతో కూడిన వినతి పత్రం డిప్యూటీ తాసిల్దార్ బాబు కి అందజేయడం జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే లింగన్న, రైతు సంఘం మండల కార్యదర్శి అయ్యప్ప, జిల్లా కమిటీ సభ్యులు భాష, రైతు సంఘం మండల కమిటీ సభ్యులు హనుమంత్ రెడ్డి, చిన్న తిక్కన్న, ముత్తన్న, దస్తగిరి బాషా, పాండవుగల్ హనుమంత్ రెడ్డి, రసాయ కార్మిక సంఘం నాయకులు కర్ణ లక్ష్మన్న, సిఐటియు నాయకులు తిప్పన్న, డివైఎఫ్ఐ నాయకులు వెంకటేష్, రైతులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బనగానపల్లె గ్రామ పంచాయితీకి స్వచ్ఛంధ్ర అవార్డు

**బనగానపల్లె, అక్టోబర్ 6, ప్రభాతవార్తః** బనగానపల్లె గ్రామపంచాయితీని స్వచ్ఛం ధ్ర, స్వర్ణాంధ్ర కార ్యక్రమం అమలులో అగ్రగామిగా నిలపడంతో బనగానపల్లె గ్రామ పంచాయితీకి స్వచ్ఛంధ్ర అవార్డు బహుకరించారు. గ్రామపంచాయితీకి సంబంధించి రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి మరియు బీసీ ఇందిరారెడ్డి సహకారంతో బనగానపల్లె గ్రామ పంచాయితీకి స్వచ్ఛంధ్ర అవార్డురావడం జరిగింది. పట్టణంలో శానిటేషన్ పనులు నిరంతరం కృషిచేయడం ద్వారా ఈఅవార్డు రావడం జరిగిందని ఈవో బొమ్మిరెడ్డి సతీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈఅవార్డు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా చేతులమీదుగా ఈవో సతీష్‌కుమార్‌రెడ్డి అందుకున్నారు. పంచాయితీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులను స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో విధులు కేటాయించడం పట్టణాన్ని సుందరనగరంగా తీర్చిదిద్దాలన్న మంత్రి బీసీ జనార్ధనరెడ్డి అలోచనకు ఈవో విధులు నిర్వహిస్తుడడం ఆయన ఈఅవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు.

# వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

**– వన్యప్రాణుల వారోత్సవాలపై అవగాహన – డిఆర్ఓ సయ్యద్ మగూ ్బల్**

**బనగానపల్లె, అక్టోబర్ 6, ప్రభాతవార్తః** బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ నందు వన్యప్రాణుల సంరక్షణపై ఈనెల 2వ తేది 8వ తేది వరకు జరిగే వన ్యప్రాణుల వారోత్సవాలపై సోమవారం విద్యార్థులకు అటవీశాఖ అధికారులు అవగాహన కల్ ్పించారు. ముందుగా ఈసందర ్భంగా డిఆర్వో సయ్యద్ మగ్బూల్ మాట్లాడుతూ ఎర్రమల కొండల పరిసర ప్రాంతాల్లో చెట్లు, జంతువులు, క్రమేపి అంతరించి పోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం



చేశారు. మనం అడవులను కాపాడుకుంటూ అవి మనల్ని కాపాడుతాయని తెలిపారు. చెట్లను నరకవద్దని వనాలను అభివృద్ధి చేయాలని అలాగే తమకు సహకరించాలని ఆయన కోరారు. అడవులను అభివృద్ధి చేస్తే వృక్ష సంపద మనుగడ సాగిస్తాయని లేనిపక్షంలో జంతు సంపద అంతరించిపోతుందని తెలిపారు. విద్యార్థులు ప్రతి ఒక్కరు చెట్ల అవశ్యకతను గుర్తించి అడవుల పరిరక్షణతోపాటు వారి పరిసరాల్లో చెట్లను పెంచాలన్నారు. చెట్లు ప్రగతికి మెట్లు అని చెట్ల వల్ల వర్షాలు కురుస్తాయని ఈప్రాంతంలో వర్షాలు సరిగా కురియడం లేదని రైతులు వర్షాల కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తాగునీటి ఇబ ్బందులను అధికారులు గుర్తుచేశారు. తమకు ఎర్రమల కొండల్లో వున్య ప్రాణులకు సహకరించాలని ఆయన కోరారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు, పాఠశాలలు, విద్యార్థిని విద్యార్థులకు ఉపాధ్యాయులతో పాటు ప్రతిఒక్కరికి వన్యప్రాణుల చట్టాలపై అవగాహన కల్పిస్తు వారోత్సవాలు చేపట్టడంపై పర్యావరణ వన్యప్రాణుల ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు, బీట్ అఫీసర్లు షేక్షావలి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

**– ఏపీ రైతు సంఘం**

**పాములపాడు రూరల్, అక్టోబర్ 6, ప్రభాతవార్తః** పాములపాడు మండలంలో ఈసంవత ్సరం అధికంగా వర్షాలు కురిసి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో తహాశీల్దార్ సుభద్రమ్మకు వినతిపత్రం అందజేశారు.



రైతు సంఘం నాయకులు కోట్ల నాగేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, సామన ్న, అంబయ్యలు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాలు కురిసి మండలంలోని మొక్కజొన్న, ఉల్లి, మిరప తదితర పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వం ఎకరాకు రూ.40 వేలు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. రబీ సీజన్‌కు ఉచితంగా విత్తనాలు, ఎరువులను పంపిణి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో రైతులు ఆనంద్ గౌడ్, బాలయేసు, ప్రతాప్, గాలి గౌడ్, రాంమూర్తి, తిమ్మయ్య, యేసేపు, ఆంజేయులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉత్తమ పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

**ఆళ్లగడ్డ, అక్టోబర్ 6, ప్రభాతవార్తః**



ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న ఎద్దుల శ్రీరాములు జిల్లాస్థాయి ఉత్తమ పారిశుద్ధ్య కార్మికునిగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. అలాగే ఆళ్లగడ్డ నియోజకవర్గ స్థాయి ఉత్తమ పారిశుద్ధ్య కార్మికులుగా నేరెళ్ళ సాల్మన్, కొమ్ము శ్రీనివాసులు, గని శివలింగం, దొర్నిపాటి లింగమయ్యలకు ప్రభుత్వం అవార్డులను ప్రకటించింది. గాంధీజయంతికి అందించి వారందరిని సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంవలో ఇంచార్జీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి ఆధ్వర ్యంలో కార్మికులందరు ఘనంగా సన్మానించారు. ఈసందర ్భంగా ఇంచార్జీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి మాట్లాడుతూ గాంధీజయంతి రోజు ఉత్తమ పారిశుద్ధ్యకార్మికులకు ప్రభుత్వం అవార్డులను ప్రకటించడం జరిగిందన్నారు. స్వచ్ఛత సేవా కార్యక్రమాల్లో చక్కని ప్రతిభ చూపినందుకు అవార్డు అందుకోవడం హర్షిణియం అన్నారు. వారిని నేడు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల తరుపున సన్మానించుకోవడం గర్వకారణమని ఆయన కొనియాడారు. మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకాశిరెడ్డినాయన విగ్రహాప్రతిష్ట వేడుకలు

**ఉయ్యాలవాడ, అక్టోబర్ 6, ప్రభాతవార్తః** ఉయ్యాలవాడ మండల పరిధిలోని నర్సిపల్లి గ్రామంలోని ఊరిచివరలో ఉన్న మంగళదాని కుంట దగ్గర వెలసిన కాశీరెడ్డినాయన మండుటెండల్లో గాలివానకు ఎన్నోఎళ్ళ తరబడి ఉండడం గ్రామస్థులు గమనించడం జరిగింది. కానీ కాశీరెడ్డి నాయన గుడి నిర్మించడానికి దాతలు ఏవరు ముందుకు రాలేదు. నర్సిపల్లెకు చెందిన స్వామి సుబ్బయ్యవారి ధర్మపత్ని వెంకటసుబ్బమ్మ కాశీనాయన గుడిని నిర్మించడం జరిగింది. అందుచేత సోమవారం చతుర్థిశి సందర్బంగా స్వామివారికి విగ్రహా ప్రతిష్ట చేయడం జరిగింది. అవధూత అయిన కాశీనాయన గుడి నిర్మించినందుకు చాల సంతోషంగా ఉందన్నారు. కాశీనాయన విగ్రహా ప్రతిష్ట చూసేందుకు హరివరం, నర్సిపల్లె గ్రామ ప్రజలు వచ్చి స్వామివారికి కాయకర్పూరాలు సమర్పించి భక్తితో



వేడుకోవడం జరిగింది. కాశీనాయన గుడి నిర్మాణానికి సుమారు రూ.3 లక్షలు ఖర్చుచేసినట్లు వెంకటసుబ్బమ్మ తెలపారు. విగ్రహా ప్రతిష్ట సందర ్భంగా గ్రామసు ్థలు కోలాటం, చక్కభజన కార్యక్రమాలు జరిపించారు. హరివరం, నర్సిపల్లె గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

**– జిల్లా రగ్బీ సంఘం అధ్యక్షులు గుడిపల్లి సురేందర్**

**కర్నూలు విద్య, అక్టోబర్ 6, ప్రభాతవార్తః** క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా రగ్బీ సంఘం అధ్యక్షులు సురేందర్ అన్నారు. జిల్లా ఎజిఎఫ్ ఆధ ్వర్యంలో సోమవారం జరిగిన రగ్బీ జిల్లా జట్ల ఎంపిక పోటీల కార్యక్రమానికి ఆయన ముఖ్య



అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శారీరక శ్రమ కలిగి క్రీడల్లో సాధన చేస్తు తమ భవిష ్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ప్రభుత్వం కేటాయించిన మూడు శాతం క్రీడా రిజర్వేషన్ కోటాలో చాలమందికి ఉన్నత విద్య, ఉపాధి ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయన్నారు. జిల్లాలో మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, మంత్రి టీజీ భరత్‌సహకారంతో రగ్బీ క్రీడలను అభివృద్ధి చేసినట్లు ఆయన గుర్తుచేశారు. మొబైల్ ఫోన్ దూరంగా ఉంచి ప్రతిరోజు తమకు నచ్చిన శారీరకశ్రమ కలిగిన క్రీడలను సాధనచేయలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర రగ్బీ సంఘం కార ్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో రగ్బీ అభివృద్ధి కొరకు టీజీ వెంకటేష్ సహకారంతో విదేశీ క్రీడా శిక్షకులను పిలిపించి దాదాపు 3 వేల మంది విద్యార్థులకు రగ్బీ క్రీడల్లో తర్ఫీదు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం జిల్లా రగ్బీ సంఘం అధ్యక్షులు సేరేందర్, టీ కృష్ణ, రామాంజనేయులు, జిల్లా హాకి సంఘం కార్యదర్శి దాసరి సుధీర్, వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులందరు క్రీడాకారులను పరిచయం చేసుకొని జిల్లా జట్ల ఎంపిక పోటీలను ప్రారంభించారు.

# జిఎస్టీ ఫలాలు అందరికి అందాలి

**కర్నూలు విద్య, అక్టోబర్ 6, ప్రభాతవార్తః** కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా దేశ ప్రజల అభ్యున్నతి కొరకు తగ్గించిన జిఎస్టీ ఫలితాలు అందరికి అందాలని క్లస్టర్ యూని వర్ ్శటి రిజి ్స్ట్రార్ జి.శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం క్లస్టర్ యూనివర్శిటిలో జిఎస్టీపై అవగాహన కార్యక్రమం సందర్భంగా ఆయన



మాట్లాడుతూ క్లస్టర్ యూనివర్శిటిలో జిఎస్టీ తగ్గింపుపై ప్రతిఒక్కరికి అవగాహన కల్పిస్తామన్నారు. క్లస్టర్ యూనివర్శిటి డిగ్రీ కళాశాలల అయిన కెవిఆర్, సిల్వర్‌జూబ్లి ప్రభుత్వ కళాశాలల్లో జిఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కెవిఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కె వెంకటరెడ్డి మాట్లాడుతూ జిఎస్టీ తగ్గింపుతో కొనుగోలు పెరిగాయని దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందన్నారు. క్లస్టర్ యూనివర్శిటి ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా.ఇందిరాశాంతి మాట్లాడుతూ ఏ వస్తువునైనా కొనేటప్పుడు జిఎస్టీ తగ్గించారా లేదా అనే విషయాన్ని గమనించాలని కొనుగోలు దారులకు సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ జిఆర్ ప్రసాద్‌రెడ్డి, ఆర్థికశాఖ అధ్యాపకులు డా.యల్లా కృష్ణాలు మాట్లాడారు. క్లస్టర్ యూనివర్శిటి డీన్స్ డా.కె నాగరాజుశెట్టి, డా.మహమ్మద్ వాహిజ్, డాక్టర్ అక్తర్‌బాను, క్లస్టర్ యూనివరి ్శటి కంట్రోల్ అఫ్ ఎగ్జామినేషన్స్ డా.బాలసుబ్రమణ్యం, క్లస్టర్‌యూనివరి ్శటి విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఆశ వర్కర్స్ లకు కనీస వేతనం ఇవ్వాలి

**నంద్యాల హాస్పటల్, అక్టోబరు 6, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఆశా వర్కర్లు గత 20 ఏళ్ళుగా పేద ప్రజలకు గర్భవతులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు వివిధ రోగాలతో ఉండిన వారికి నిత్యం అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం, ఆశా వర్కర్స్



యూనియన్ జిల్లా కార్యదర్శి జి,రమణకుమారి డిమాండ్ చేస్తు సూపరిండెంట్ గురుస్వామికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతు ఎన్నికల సంధర్బంగా కూటమి నాయకులు ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామనివాగ్దానం చేశారని, ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావస్తున్న నేటికి వారి హామీలు అమలు చేయలేదన్నారు. గిరిజన గూడెంలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేసి ఆశలతో పాటు సమానంగా వేతనాలు ఇవ్వాలని, ప్రమాదంలో గాని ఆనారోగ్యంతో గాని మరణించిన ఆశాల కుటుంబాలకు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి, ఆశ వర్కర్లపై రాజకీయ జోక్యం లేకుండా చూడాలి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప జేయాలన్నారు. యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి షమీం, శివమ్మ, శిరోమణి, వసంత, సోని పాల్గొన్నారు.

# మహానందిలో ప్రముఖుల పూజలు

**మహానంది, అక్టోబర్ 6, ప్రభాతవార్తః** మహానంది పుణ్యక్షేత్రంలో ప్రముఖులు పూజలు నిర్వహించారు. సోమవారం స్వామివార్ల దర్శనార్థమై విడి విడిగా బెంగుళూరు అడిషనల్ ఎస్పీ దీపక్, జేన్ కో చీఫ్ ఇంజనీర్ తిరుమల ప్రసాద్‌లు కుటుంబ సమేతంగా శ్రీకామేశ్వరీదేవి



సహిత మహానందీశ్వరస్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనవాయితీ ప్రకారం వేదపండితుల వేదమంత్రోచ్చరణ మధ్య కండువా కప్పి స్వామివార్ల ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట మహానంది మండల ఏఈ ప్రభాకర్‌రెడ్డి, కానిస్టేబుల్ శేషన్న తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు జిల్లాలో అన్ని మండలాలను అతివృష్టి మండలాలుగా గుర్తించాలి..!



**కర్నూలు, అక్టోబర్ 6, ప్రభాతవార్త ప్రతినిధి:** అధిక వర్షాల వల్లనష్టపోయి నపంటలన్నిటికీ ఎకరాకు 50 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ ) ఏపీ రైతు సంఘం డిమాండ్.. చేస్తుంది అందులో భాగంగా ఈరోజు కల్లూరు మండల ఆఫీస్ వరకు ర్యాలీ జరిపి తనంతరం ధర్నా చేయడం జరిగింది ఈ ధర్నాకు నగరపార్టీ కార్యవర్గ సభ్యుడు వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ సీనియర్ నాయకులురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం గారు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం(తి.రీఫ్) కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి దంభోళంశ్రీనివాసరావు వారుమాట్లాడుతూ2025 సంవత్సరం ఖరీఫ్ సీజన్లో కర్నూలు జిల్లాలో ముందుగానే వర్షాలు విస్తారంగా రావడం వలన రైతులు ఉల్లి, టమోటా కంది ప్రతి మిరప సజ్జ కొర్ర రాగి మొక్కజొన్న ఆముదంవేరుశనగ తదితర పంటలు విస్తారంగా లక్షల ఎకరాల్లో వేయడం జరిగింది. మంచి పంటలు వస్తాయి అని ఆశించిన సమయంలో ఆగస్టు సెప్టెంబర్ నెలలో నిరవధికంగా భారీ వర్షాలు కురవడంతో రైతులు వేసిన పంటలు ఉల్లి టమాట పత్తి వేరుశనగ మిరప కంది మొక్కజొన్న మొదలగు పంటలు అధిక వర్షాల వలన భూమిలోనే కుళ్ళిపోవడం జరిగింది. ఈ సంవత్సరం జిల్లాలో సాధారణ వర్షపాతం కన్నా 37.9 వర్షం అధికంగా వచ్చింది పంట పొలాల్లోనే వర్షపు నీరు నిల్వ ఉండడం అదేవిధంగా వివిధ మండలం లో కూడా చాలా గ్రామాల్లో ఇండ్లలోకి నీరు రావడం జరిగింది. కర్నూలు జిల్లాలో పాణ్యం నియోజకవర్గం పరిధిలోని కల్లూరుమండల గ్రామాల్లో కూడా విపరీతంగా వర్షాలు కురిసాయి వాగులు వంకలు పొంగి పొర్లాయి రైతులు వేసుకున్న పంటలన్నీ కొట్టుకొని పోయాయి ఉల్లి టమోటా అరకొరగా పంట పండిన గిట్టుబాటు ధర లేక పోవడంతో రైతులు తమ పంటలను పొలాల్లోనే వదిలేయడం మార్కెట్లోనూ రోడ్ల వెంబడి పార వేయడం జరిగింది. ఇది అత్యంత బాధాకరమైన విషయం పంటలు పూర్తిగా సల్కాపురం మార్కాపురం పర్లే కొట్టాల చిన్నటేకూరు పెద్దటేకూరు మొదలగు గ్రామాలను సందర్శించి వివిధ ప్రాంతాలను పార్టీ రైతు సంఘం నాయకులు ఆ గ్రామాల్లోకి పోయి ఆ రైతుల ఇబ్బందులు కష్టాలు తెలుసుకొని వచ్చామని ఆ సందర్భంగా అతివృష్టి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేనందు వల్ల రైతులు నష్టపోవడంతో రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారుఅని రైతులు వ్యవసాయ సాగు పెట్టుబడి కోసం బ్యాంకుల యందు ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తుల దగ్గర అప్పులు తీసుకొని పెట్టుబడి పెట్టారు ఇంత జరుగుతున్న ప్రభుత్వం అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి నష్టపోయిన పంటలన్నిటిని త్వరగా పంట పరిశీలన చేసి పంటల జాబితాలను తయారు చేసి ఎకరాకు 50వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని మరియు ఫసల్ బీమా వాతావరణ బీమా రైతుల పంటలన్నిటికీ షరతులు లేకుండా వర్తింపజేయాలని పంట రుణాలు మాఫీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కార్యవర్గ సభ్యులు అన్వర్‌భాష, రామాంజ నేయులు, నూర్జహాన్ రబియా, టేకురు పుల్లన్న, దొడ్డిపాడు భాష, ఏఐటీయూసీ నాయకులు కృష్ణారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, కృష్ణా నాయక్ ప్రసాదు, మునెమ్మ, రాముడు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు నష్ట పోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

**– తాహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ధర్నా**



**కోడుమూరు,అక్టోబర్ 6, ప్రభాతవార్త ః** భారీ వర్షాలకు నష్ట పోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతూ సోమవారం స్థానిక తాహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ధర్నా చేసింది. ఈ సందర్భంగా జరిగిన ధర్నానుద్దేశించి జిల్లా సిపిఐ సహాయకార్యదర్శి లెనిన్ బాబు మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలన్నీ పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయని, వీటిని సాగు చేసుకున్న పంటలన్నీ అధిక వానలకు పెద్ద ఎత్తున నష్ట పోయ్యారన్నారు. ఎంతో వ్యయ ప్రయాసాలతో సాగు చేసి పండించుకున్న పంటలు ఉల్లి,టమోట పంటలకు గిట్టుబాటు ధరలు లేక పెద్ద ఎత్తున నష్ట పోయ్యారన్నారు. అందుకే ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసుకున్న రైతులకు ఎకరాకు 50వేల రూపాయల ప్రకారంగా పంట నష్టం కల్పించాలని డిమాండ్ చేశారు. భారీ పెట్టుబడులతో పెట్టిన పంటలకు ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధరలు కల్పించాలని, ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించక పోవడంతో భారీ నష్ట పోయ్యారని, అంతే గాక ఏటా రైతులకు ఆశించిన మేరకు పాలక ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలు కల్పించక పోవడంతో అసువులు చాలిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తారు. అంతే గాక వచ్చే రబీ సీజన్‌లో ప్రభుత్వం రైతులకు 90 శాతం మేరకు సబ్సిడీపై విత్తనాలను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిపిఐ నాయకులు రాజు,శేషుకుమార్,ఎం. రాముడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాహశీల్దార్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు.

## ఈ క్రాప్ నమోదు గడువు పొడిగింపు!



**పెద్దకడబూరు, అక్టోబర్ 6, ప్రభాతవార్త :** ఖరీఫ్ సీజన్ సాగు సంబంధించిన ఈపంట డిజిటల్ సర్వే నమోదు గడువును ఈ నెల అక్టోబర్ 25వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని పాస్ పుస్తకం ఉన్న ప్రతి రైతు ఈ క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిని సుచరిత రైతులను కోరారు సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వము నిర్ణయించిన గడువులోగా చాలామంది రైతులు తమ పంటలను నమోదు చేసుకోలేకపోయారని ఈ పొడిగింపు వల్ల, ఇప్పటి వరకు మిగిలిపోయిన రైతులందరు తప్పనిసరిగా తమ పంటల వివరాలను ఆర్.ఎస్.కె ల ద్వారా పంటలను నమోదు చేసుకోవాలన్నారు ఈక్రాప్ నమోదు గడువు పెంపును ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు రైతులకు ప్రభుత్వ పథకాలు, ముఖ్యంగా ఖిపంటల బీమాఖి మరియు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరతో పంట అమ్మకాలు వంటి ప్రయోజనాలు పొందాలంటే ఈక్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఈ డిజిటల్ సర్వే ద్వారా సేకరించిన సమాచారం అన్ని రైతు సంక్షేమ కార్యక్రమాలకు ఏకైక ప్రామాణికంగా పనిచేస్తుంది కాబట్టి, ప్రతి రైతు తమ సాగు వివరాలు ఇందులో నమోదు అయి ఉండేలా రైతులు చూసుకోవాలన్నారు ఈకేవైసీని నోటిఫైడ్ పంటలకే పరిమితం చేసిందని ఈ కేవైసీ పూర్తి చేసుకున్న పంటలకు మాత్రమే బీమా వంటి ప్రయోజనాలు వర్తించే అవకాశం ఉందని ఈ విషయాన్ని రైతులకు తప్పనిసరిగా గుర్తుంచుకోవాలన్నారు.

## జాతీయ స్థాయి ఈత పోటీలకు విద్యార్థులు ఎంపిక



**గూడూరు, అక్టోబర్ 6, ప్రభాతవార్త ః** త్వరలో జరిగే జాతీయ స్థాయి ఈత పోటీలకు గూడూరుకు చెందిన విద్యార్థులు ఉదయ్ కుమార్,ఎం.సూర్యతేజ,ఎం.శశాంక్‌లు ఎంపికయ్యారు. ఈ నెల 4వ తేది నుంచి 5వ తేది వరకు కర్నూలులో జరిగిన 4వ రాష్ట్ర స్థాయి ఈత పోటీలల్లో ఆ విద్యార్థులు రాణించి జాతీయ స్థాయి ఈత పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో ఉదయ్ కుమార్ డిప్లమాలో రెండవ సంవత్సరం చదువును సాగిస్తున్నాడు. అలాగే సూర్యతేజ గుంటూరులో ఇంటర్ రెండవ సంవత్సరం,డోన్‌లో శశాంక్ 8వ తరగతి చదువుతున్నాడు. వీరికి ఈతలో మంచి ప్రావీణ్యం ఇచ్చి జాతీయ స్థాయికి ఎంపికకు కృషి చేసిన ఈత కోచర్ దత్త మునిస్వామిని అభినందించారు. జాతీయ స్థాయి ఈత పోటీలకు ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో గెలుపొందడంతో పాటు వారు అరుదైన పథకాలను సాధించి పెట్టారు.

## అడవి జంతువులను రక్షించుకుందాం..!

**మహానంది, అక్టోబర్ 6, ప్రభాతవార్తః**



అడవి జంతువులను రక్షించుకుందామని మహానంది డిఆర్ఓ హైమావతి తెలిపారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా సోమవారం అడవి జంతువులు, అడవులను రక్షించుకోవడం ద్వారా కలిగే ఉపయోగాల గురించి రామకృష్ణ విద్యాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అడవి జంతువులను వేటాడటం నేరమన్నారు. అలా ఏవరైనా అడవి జంతువులను వేటాడుతుంటే సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించి వారి పేర్లు బయటకు రాకుండా ఉంచుతామనా న్నరు. అలాగే అడవులను రక్షించుకోవడం అందరి బాధ్యతన్నారు. అడవులను రక్షించుకోవడం ద్వారా పర్యావరణం దెబ్బతినకుండా మంచి వాతావరణం అందుతుందని, సకాలంలో వర్షాలు పడతాయన్నారు. ఈకార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ అఫీసర్ రామకృష్ణ, బీట్ అఫీసర్లు రాణా ప్రతాప్, శ్రీనివాసులు, బలరాముడు, ప్రొటక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన మొక్కజొన్న రైతులను ఆదుకోండి



**రుద్రవరం, అక్టోబర్ 6, ప్రభాతవార్తః** ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రుద్రవరం మండల కమిటీ ఆధ్వర్యంలో వరుసగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అధిక వర్షాల వల్ల మండలంలో మొక్కజొన్న పంట వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కావునా ప్రభుత్వం ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని మద్దతు ధర క్వింటాకు రూ.2400లు ప్రకారం కొనుగోలు చేసి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరుతూ మండల తహశీల్దార్ దోని అల్‌ఫ్రెడ్,మరియు వ్యవసాయ విస్తరణ అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, రైతుసంఘం మండల అధ్యక్షులు గుర్రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జి శంకరయ్య, మండల సహాయ కార్యదర్శి నరేష్, శ్రీనివాసరెడ్డిలతో పాటు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## వాల్మీకి జయంతి వేడుకలను విజయవంతం చేద్దాం

**– వాల్మీకి సంఘం నాయకులు అర్ధగేరి శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ తిమ్మప్ప పిలుపు**



**హాలహర్వి, అక్టోబరు 6, ప్రభాతవార్త ;** మండలంలోని ఆయా గ్రామాల్లో వాల్మీకులు అంత కలిసి వాల్మీకి జయంతిని విజయవంతం చేయాలని వాల్మీకి సంఘం నాయకులు అర్ధగేరి శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ తిమ్మప్పలు పిలుపునిచ్చారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వాల్మీకి జయంతి వేడుకలను పండగ వాతావరణంలాగా జరుపుకోవాలని సూచించారు. అలాగే వాల్మీకి ఎస్టీ రిజర్వేషన్ సాధన కోసం వాల్మీకులంతా పోరాటం చేయాలని కోరారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరిస్తే రాజకీయంగా, విద్య, ఉద్యోగాల్లో న్యాయం జరుగుతుందన్నారు.

## టీడీపీ కార్యకర్తకు అండగా ఉంటాం

**– టీడీపీ కౌతాళం పట్టణాధ్యక్షుడు కాశీ విశ్వనాథ్**

**కౌతాళం, అక్టోబరు 6, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన కౌతాళంలోని ఎన్టీఆర్ నగర్ కాలనీకి చెందిన నేసే ఆంజనేయ సతీమణి ఈరమ్మ అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ కౌతాళం పట్టణాధ్యక్షులు కాశీ విశ్వనాథ్ బాధితా కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మట్టి ఖర్చులకై రూ.5 వేలు సాయం అందించారు. బాధితా కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. నివాళులు అర్పించిన వారిలో టీడీపీ నాయకులు మంజునాథ్, రాజబాబు, భీమయ్య, నాగప్ప, నరసయ్య, టీడీపీ కార్యకర్తలు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి ధర్నాను విజయవంతం చేయండి

**అవుకు రూరల్, అక్టోబర్ 6, ప్రభాతవార్తః**



ఉద్యోగ ఉపాధ్యాయ ఆర్థికపరమైన డిమాండ్లపై నేడు జరగబోయే ప్యాప్టో రాష్ట్ర ధర్నాకు ఉపాధ్యాయులు తరలిరావాలని ఏపీటిఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షులు బి.మాధవస్వామి పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల అంశాలను తుంగలో తొక్కినష్టం చేకూర్చిందని ఈప్రభుత్వమైన ఉద్యోగ ఉపాధ్యాయులకు మేలు చేస్తుందని ఆశించామని ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అయినప్పటికి నాలుగు డిఏలు పెండింగ్‌లో ఉన్నాయి. పిఆర్సీ కమిషన్ లేదు, పిఆర్సీ అరియర్స్ ఇంతవరకు జమకాలేదు. సిపిఎస్ ఉద్యోగుల 90 శాతం అమౌంట్ క్రిడిట్ కాలేదు. కేంద్రప్రభుత్వం ఇచ్చిన మెమో 57 ప్రకారం 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాతపెన్షన్ వర్తింప జేయడం తదితర అంశాల సాధనకై రాష్ట్ర ప్యాప్టో కమిటీ పిలుపు మేరకు 7న ధర్నాను విజయవంతం చేయాలనికోరారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుండ్ల శింగవరం నందు పోస్టర్‌లను విడుదల చేశారు. ప్రధానోపాధ్యాయులు షేక్ రసూల్ బాష, ఏపీటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జి లింగమయ్య, రాష్ట్ర కౌన్సిలర్ గోవిందనాయక్, మహమ్మద్ షఫి, తిమ్మయ్య, వెంకటసుబ్బయ్య, శ్రీలత, లత పాల్గొన్నారు.

## పేకాటస్థావరంపై దాడి

**– 9 మంది అరెస్టు – రూ.10,100లు నగదు స్వాధీనం – ఎస్ ఐ మహమ్మద్ రఫీ**



**రుద్రవరం, అక్టోబర్ 6, ప్రభాతవార్తః** మండల పరిధిలోని నక్కలదిన్నె గ్రామంలో పేకాట స్థావరంపై దాడిచేసి 9 మందిని అరెస్టుచేసి రూ.10,100ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. ఈసందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ నక్కలదిన్నె గ్రామంలో పేకాట అడుతున్నట్లు తమకు సమాచారం అందడంతో తమ సిబ్బందితో పేకాటస్థావరంపై దాడిచేశామన్నారు. ఇందులో భాగంగా 9 మంది పేకాట రాయుళ్ళను అరెస్టుచేసి వారి వద్ద నుంచి నగదును పేకాట ముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## విద్యార్థులకు క్యాన్సర్ నివారణ టీకాలు



**జూపాడుబంగ్లా,అక్టోబరు 6,ప్రభాతవార్త:** మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బచ్చు జానకిరాం ఫౌండేషన్ ద్వారా హెపివి టీకాలను డాక్టర్. బి.రవీంద్రబాబు, డాక్టర్.బి.సాయివాణి వేశారు. సోమవారం కర్నూలు ఓమేగా హాస్పటల్ ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు డా.రవీంద్రబాబు తన సొంత గ్రామంలో రెండవ విడత దోసును విద్యార్థులకు వేశారు. గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి,నాగార్జునరెడ్డి,జయనాగేశ్వర్‌రెడ్డి,ఉపాధ్యాయులు,హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపుపై సంక్షేమాధికారుల అవగాహన కార్యక్రమం

**– 2.0 సంస్కరణల స్లాబులను తగ్గించడం హర్షణీయం – హెచ్‌డబ్ల్యూఓ నాగమద్దయ్య**




**ఆదోనిలీగల్, అక్టోబరు06, ప్రభాతవార్త;** ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ అమలులో భాగంగా 2.0 సంస్కరణల స్లాబులను తగ్గించడం హర్షణీయమని సాంఘిక, సంక్షేమ శాఖ అధికారులు నాగమద్దయ్య, నం–1 బాలుర హాస్టల్ వార్డెన్ సిద్దప్ప, బాలికల కళాశాల వార్డెన్ ఎస్.కలితలు అన్నారు. సోమవారం పట్టణంలోని సెలూన్ దుకాణాలు, బ్యూటీ పార్లర్, యోగా సెంటర్లలో ఉచిత జీఎస్టీపై అవగాహన కల్పించారు. గతంలో 5 శాతం, 12 శాతం, 18 శాతం, 20 శాతం అమలులో ఉండేవన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 5 శాతానికి స్లాబులను తీసుకొచ్చాయన్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలు నిత్యావసర వస్తువులను విరివిగా కొనుగోలు చేయవచ్చన్నారు. కిరణా, వంట సామగ్రి, ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు తగ్గే అవకాశం ఉందన్నారు. జీఎస్టీ అమలు పట్ల వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశల మేరకు తాము వినియోగదారులకు అవగాహన కల్పిసుత్న్నట్లు తెలిపారు. వంద శాతం ఆరోగ్యం, ఎల్ఐసీలకు మినహాయింపు ఇవ్వడం జరిగిందన్నారు. సాంఘిక సంక్షేమశాఖ జిల్లాధికారిణణ రాణిక ఆదేశాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

## ఘనంగా వడ్డే ఓబన్న 179వ వర్ధంతి వేడుకలు

**– వడ్డే ఓబన్న ఆశయాలను సాధిద్దాం**



**గడివేముల, అక్టోబరు06, ప్రభాతవార్త;** మండలంలోని గడిగరేవుల గ్రామంలో సోమవారం అఖిల భారత ఒడ్డే ఓబన్న సేవా సమితి ఆధ్వర్యంలో మొదటితరం స్వాతంత్ర్య సమరయోధుడు, రేనాటి వీరుడు వడ్డే ఓబన్న 179వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డెర పెద్దలు దేరంగుల రమణ తదితరులు మాట్లాడారు. స్వాతంత్ర్యం కోసం తన మిత్రుడు అయిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో కలిసి వడ్డే ఓబన్న బ్రిటీష్ వారితో చివరి శ్వాస వరకు విరోచితంగా పోరాడి 39 సంవత్సరాల వయస్సులోనే వీరమరణం పొందారన్నారు. బానిసలుగా బతుకుతున్న ప్రజలకు వడ్డే ఓబన్న గారి పోరాటం నేటి తరాల వారికి స్ఫూర్తిదాయకమన్నారు. నేడు వడ్డే ఓబన్న వర్ధంతి సందర్భంగా వారి ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర పెద్దలు దేరంగుల రమణ, గోగుల జమ్ములు, జీపీ వెంకటేశ్వర్లు, పల్లపు జమ్ములు, నంద్యాల జిల్లాధ్యక్షులు బివిఎన్ రాజు, జనరల్ సెక్రటరీ కేతన సురేష్, వడ్డెర యువకులు పాల్గొన్నారు.

## బీసీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం

**– టీడీపీ యువ నాయకులు కాకర్ల శాంతికుమార్**



**దేవనకొండ, అక్టోబరు06, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన దేవనకొండలోని బీసీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి చర్యలు తీసుకుంటున్నట్లు టీడీపీ యువ నాయకులు కాకర్ల శాంతికుమార్ తెలిపారు. సోమవారం కాలనీలో ఆయన దేవనకొండ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఈఓ రఫీతో కలిసి పర్యటించి ప్రజల సమస్యలను ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి ఆదేశాల మేరకు తెలుసుకున్నారు. దమ్మురాటు నరసమ్మ ఇంటి వద్ద డ్రెయినేజీ మురుగనీరు ఇళ్లల్లోకి వస్తున్నట్లు తెలుసుకున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలను తెలుసుకుని, వాటిని టీడీపీ ఇన్‌చార్జి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని చెప్పారు. ఈయన వెంట దేవనకొండ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఈఓ రఫీ, స్థానిక నాయకులు ఉన్నారు.

## గ్రంథాలయానికి పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ బుక్స్ వితరణ



**నందికొట్కూరు, అక్టోబరు 6, ప్రభాతవార్త :** పట్టణంలోని గ్రంథాలయానికి పిరమిడ్ స్పిరిచువల్ సొసైటి వారు యోగా, మెడిటేషన్, కాన్ఫిడెన్స్, అవేర్నెస్, రిలాక్సేషన్స్, స్మృతులు, తాళపత్ర గ్రంథాలు, సద్గురువుల చరిత్రలకు సంభంధించిన వివిధ రకాల 150 పుస్తకాలను గ్రంథాలయ నిర్వహాణాధికారి మురళీధర్‌కు అదజేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో పిరమిడ్ సొసైటి వారు మాట్లాడుతు ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన పుస్తకాలను ఇవ్వడం జరిగిందని కావున ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలేని వారు తెలిపారు.

## ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండించిన మాలమహానాడు



**నందికొట్కూరు,అక్టోబరు 6,ప్రభాతవార్త:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై కోర్టులో దాడిని మాలమహానాడు తాలుకా కమిటీ తీవ్రంగా ఖండిస్తూన్నామని ఇది దేశ చరిత్రలో చీకటి రోజని వారు తెలిపారు. సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతు ఎంతటి ఉన్నత స్థాయిలో ఉన్న కుల వివక్షత వెంటాడుతూ ఉంది అనడానికి ఈ రోజు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై ప్రత్యక్షంగా దాడికి పాల్పడడం దారుణమని, ఈ దాడి రాజ్యాంగం మీద, భారత పార్లమెంటు మీద, భారత అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు మీద,ప్రజాస్వామ్యం మీద దాడిగా పరిగణించి దాడికి పాల్పడిన లాయర్‌పై దేశ ద్రోహం కేసు పెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు డా.వవెంకటేష్, సొగరాజు సుధాకర్, వనమాల నాగన్న, పడిగెల నాగేంద్ర, మునిస్వామి, బండారు శ్రీనువాసులు, ప్రకాష్,రవికుమార్, పెరుమాళ్ళ మధు, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

## దేవనకొండ మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

**– సీపీఐ, ఏపీ రైతుసంఘం నాయకుల డిమాండ్**



**దేవనకొండ, అక్టోబరు 6, ప్రభాతవార్త;** అధిక వర్షాల కారణఁగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, అతి వృష్టి కారణంగా దేవనకొండ మండ లాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని సీపీఐ మండల కార్యదర్శి ఎం.నరసారావు, మండల కార్యదర్శి సి.బజారిలు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి దేవనకొండ తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐ నాయుకలు ఎర్రగోటి శేఖర్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో కురిసిన అధిక వర్షాల కారణంగా రైతులు పూర్తి స్థాయిలో పంటలు నష్టపోయారన్నారు. పంటలకు వేలాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయారన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఎకరాకు రూ.50 వేలు చొప్పున పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఏఓ ఉషారాణికి, తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. సీపీఐ, రైతు సంఘం నాయకులు హరిచంద్ర, కిష్టన్న, భూపేష్, చిన్న మద్దిలేటి, వీరంజి, రవి, అనుమప్ప, రమేష్, వీరస్వామి, ప్రసాద్, ఓంకార్, భాస్కర్, మాబాషా, రషీద్, రంగడు, శ్రీనివాసులు, సురేష్, ఆటో రంగయ్య, మురళి, కోదండ, రంగస్వామి పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కారించాలని.. సచివాలయ ఉద్యోగులు ధర్నా..!



**నందికొట్కూరు, అక్టోబరు 6,ప్రభాతవార్త:** తమ సమస్యలను పరిష్కారించాలని కోరుతు సచివాలయ ఉద్యోగులు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి మున్సిపల్ కమీషనర్ ఎస్.బేబి కి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతు సచివాలయ ఉద్యోగు లను ఇంటింటికి తిరిగి నిర్వహించే సర్వేలు మరియు ఇతర పనుల నుండి విముక్తి కల్పించాలని, గ్రామవవార్డు, సచివాలయ ఉద్యోగులను మాతృశాఖలకు అప్పగించాలని, నోష్నల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి, ఆరు సంవత్సరాల పాటు క్యాడర్లో సర్వీస్ చేసిన ఏఏఎస్ ప్రకారం స్పెషెల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి, అన్ని విభాగా వారిగా ప్రమోషన్ చానల్స్ ఏర్పాటు చేసి జిల్లా వారిగా సీనియారిటి జాబితా విడుదల చేయాలి, సచివాలయ ఉద్యోగులకు స్టేషన్ సీనియారిటి ఆధారంగా పారదర్శక బదిలీలు జరిగే ప్రత్యేక విధి విధానాలు ఖరారు చేస్తు ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కారించక పోతే రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ వార్డు, సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక తరుపున ఉద్యోగుల నియమ నిభంధనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## నందికొట్కూరులో శ్రీశ్రీశ్రీ చిన్న జియర్‌స్వామి శిష్యుల పర్యటన



**నందికొట్కూరు,అక్టోబరు 6,ప్రభాతవార్త:** శ్రీశ్రీశ్రీ చిన్న జియర్‌స్వామి శిష్యులు శ్రీ సముద్రాల ఆచార్య శికామణి మరియు వారి మిత్ర బృందం సోమవారం పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం సంధర్శించారు. వీరికి ఆలయ అర్చకులు, పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు భీమిశెట్టి జయరామ కృష్ణ మరియు కమిటీ సభ్యలు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఆశీర్వాదం పొందారు. భక్తులకు స్వామీజి సూక్తులు, ప్రవచనాలు భోధించారు. ప్రవీణ్ ప్రభువు జి, కమిటీ సభ్యులు ఆర్వేటీ సుబ్రమణ్యం, వీరబొమ్మ శ్రీనువాసులు, సర్విశెట్టి పార్థసారథి, బలుసా నాగరాజు,బద్రిశెట్టి సురేష్‌కుమార్, వాసవి మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

## రుద్రవరం ఆదర్శపాఠశాలకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డు




**రు ద్రవరం, అక్టోబర్ 6, ప్రభాతవార్తః** రుద్రవరం ఆదర్శపాఠశాల జిల్లాస్థాయి స్వచ్ఛ పాఠశాల అవార్డుకు ఎంపికైనట్లు సోమవారం ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, శానిటేషన్, ఐజిన్ పరిరక్షణలో విశేష కృషిచేసినందుకు ఈఅవార్డు లభించిందని ఆయన తెలిపారు. గౌరవ జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, డిఈవో జనార్ధన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఈ అవార్డుకు ముఖ్యకారణం మోడల్ స్కూల్ జేడి తెహారా సుల్తానా, డిఈవో జనార్ధన్‌రెడ్డి, డిప్యూటి డిఈవో శంకర్ ప్రసాద్, ఎంఈవోలు వీరరాఘవయ్య, లక్ష్మీ, ఉపాధ్యాయ బృ ందం, పాఠశాల విద్యార్థులు సిబ్బందికి లోకల్ నాయకులకు, విద్యార్థుల తల్లిదండ్రుల అందరి సహాయ సహకారాలతో సాధించిన విజయం ఇది అన్నారు. ఈ అవార్డు కొరకు కృషిచేసిన అందరికి పాఠశాల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

## అడవులు, వన్యప్రాణుల సంరక్షణ చట్టాలపై అవగాహన

**రుద్రవరం, అక్టోబర్ 6, ప్రభాతవార్తః** అడవులు, వన్యప్రాణుల సంరక్షణ చట్టాలపై రుద్రవరం అటవీశాఖ రేంజ్ అధికారి ముర్తుజా వలి ఏపీ మోడల్‌స్కూల్ విద్యార్థులకు వకృత్వ పోటీలు సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటి డైరెక్టర్ ప్రాజెక్టు టైగర్ అనురాగ్ మీనా వారి అదేశాల మేరకు సబ్ డిఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు సమక్షంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా అడవులు మరియు వన్యప్రాణుల సంరక్షణ గురించి అటవీ చట్టాల గురించి విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించామన్నారు. వకృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అఫీసర్లు శ్రీనివాసులురెడ్డి, మక్తర్ బాష, రామకృష్ణ, బీట్ అఫీసర్‌లు మదనగోపాల్, సురేంద్ర గౌడ్, నరసింహారెడ్డి, జేమ్స్‌పాల్, పాఠశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

KURNOOL MUNICIPAL CORPORATION
e-Procurement Notice
Tender Notice No.16-1 to 16-4/General Funds/EE&SE/Knl/25-26, dt.04-10-2025
(7 Days Short Tender)

| | |
|---|---|
| Name of the Scheme | General Funds (7 Days Short Tender) |
| No of works | 04 |
| Bid document download starting date | 06/10/2025 at 5.30 P.M |
| Bid document download end date | 13/10/2025 at 4:00 P.M |
| Last Date & Time for receipt of Bids | 13/10/2025 at 5:00 P.M |
| Commercial Bid Opening Date | 13/10/2025 at 5:30 P.M |

Further details and Corrigendum can be seen @ e procurement market place at www.tender.apeprocurement.gov.in Commissioner, Kurnool Municipal Corporation, Kurnool. For Contact 9849908497, 9849908470.
Commissioner,
Kurnool Municipal Corporation, Kurnool.

# చెత్త కుప్పలు లేని జిల్లాగా.. తీర్చిదిద్దండి

**సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను క్రమంగా నిషేధించాలి : జిల్లా కలెక్టర్**

**నంద్యాల, అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి**
స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లాను శుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సత్సంకల్పంతో పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. సోమవారం పీజీఆర్ఎస్ హాల్లో స్వచ్ఛ ఆంధ్రా అవార్డ్స్-2025 జిల్లా స్థాయి బహుమతుల ప్రధాన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, డీపీవో లలితాబాయి, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డోన్ మున్సిపల్ చైర్‌పర్సన్ రాజేష్, నంద్యాల ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మోలానా ముస్తక్ అహ్మద్ తో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జి. రాజకుమారి మాట్లాడుతూ రాబోయే మూడు నెలల్లో నంద్యాల జిల్లాలో ఎక్కడా చెత్త కుప్పలు లేకుండా స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దే దిశగా ప్రతి ఒక్కరూ చురుకుగా పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొనాలని తీర్మానించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వ్యాపార ప్రదేశాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని క్రమంగా అమలు చేసి, తరువాత దాన్ని జిల్లా వ్యాప్తంగా విస్తరించాలని రెండవ తీర్మానంగా నిర్ణయించారు. ద్రవ, ఘన వ్యర్థాలను వేరుగా వర్గీకరించేందుకు శ్రీకారం చుట్టాలని మూడవ తీర్మానంగా నిర్ణయించారు. జిల్లాలోని మెప్మా మరియు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలోని మహిళా స్వచ్ఛంద సమూహాల ద్వారా ఇంట్లోనే చెత్తతో కంపోస్ట్ తయారీని ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలని నాలుగో తీర్మానం, నీటి మట్టాలు తగ్గిపోయిన 165 గ్రామాల్లో భూగర్భ జలాలను పునరుద్ధరించేందుకు ప్రత్యేక రీచార్జ్ నిర్మాణాలు చేపట్టాలని ఐదవ తీర్మానంగా సూచించారు. జిల్లాలో పారిశుద్ధ్య కార్యక్రమాల్లో జిల్లా స్థాయి అవార్డులు సాధించిన సంస్థలు రాష్ట్రస్థాయి అవార్డులను లక్ష్యంగా పెట్టుకుని మరింత కృషి చేయాలని కలెక్టర్ కోరారు. రాష్ట్రాన్ని స్థిరమైన, సుస్థిరమైన, ఆరోగ్యకరమైన స్వర్ణాంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆమె గుర్తుచేశారు. ఇందులో భాగంగా



ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛంధ్ర కార్యక్రమంగా నిర్వహిస్తూ ప్రజల్లో పరిశుభ్రత పట్ల అవగాహన పెంచుతున్నామని తెలిపారు. ప్రతి కుటుంబం తమ ఇళ్లను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు చెత్తను రోడ్లపై లేదా డ్రైన్లలో వేయకుండా సామాజిక ప్రదేశాల్లో స్వచ్ఛత పాటించాలని సూచించారు. నంద్యాల జిల్లాలో 24 పర్యాటక కేంద్రాలు ఉన్నందున వాటిని పరిశుభ్రంగా ఉంచి పర్యాటకులకు ఆహ్లాదకర అనుభవం కలిగించేందుకు కృషి చేయాలని చెప్పారు. అదేవిధంగా స్మశాన వాటికల అభివృద్ధికి, వాటికి సరైన రహదారులు ఏర్పాటుకు కూడా చర్యలు చేపడతామని తెలిపారు. నంద్యాల మున్సిపల్ డంపింగ్ యార్డ్ 17 ఎకరాల్లో విస్తరించి ఉందని, ఇటీవల కాలంలో 6 వేల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించి 520 మొక్కలను నాటినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

# గ్యాస్ లీకైన ప్రమాదంలో.. నలుగురికి గాయాలు

- భార్య,భర్త ఇద్దరు పిల్లలకు తీవ్రగాయాలు...
- కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు..
- 5 నెలల గర్భిణీగా ఉన్న భార్య సువర్ణకు తీవ్రగాయాలయ్యాయన్న వైద్యులు..

**వెల్దుర్తి, అక్టోబర్6,ప్రభాతవార్త**
మండలంలోని ఎస్.బోయినపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి గ్యాస్ లీకైన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి కాలిన గాయాలు అయ్యాయ. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న బండ నాగరాజుకు భార్య సువర్ణ,9 సంవత్సరాల అనిల్,3 సంవత్సరాల చరణ్‌లు ఉన్నారు. అయితే వీరికి గ్రామం మధ్యలో రత్నాపల్లికి వెళ్లే దారిలో ఒక చిన్న ఇల్లు ఉంది. చుట్టూ గోడలు కట్టుకొని పై కప్పు రేకులు వేసుకొని అందులోనే ఉన్నారు. ఇటీవలె దసరా పండుగ జరుపుకొని ఆ సంతోషంలో నుంచి ఇంకా తేరుకోక ముందే వారి ఇంట్లో ఉండే గ్యాస్ సిలిండర్ నుంచి గ్యాస్ లీకై ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. అకస్మాత్తుగా మంటలు ఎగసిపడడంతో ఇంట్లో ఉన్న వస్తువులు చిన్నాభిన్నమయ్యాయి. ఇంటి పై కప్పుకు ఉన్న రేకులు పైకి లేచి యధాస్థితికి చేరుకున్నాయి. గోడ సైతం బీటలు వారింది. ఇంటి బయట ఉన్న అరుగుపై బండలు పగిలిపోయాయి. వారి ఇల్లు ప్రధాన ద్వారంలో ఉన్న రేకుల వాకిలి సైతం బెండయ్యింది. ఇక ఆ ఇంట్లో ఉన్న కుటుంబసభ్యులు భార్య, భర్త, ఇద్దరు చిన్నారులు కాలిన గాయాలతో విలవిలలాడారు. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో చుట్టు ప్రక్కల వారు గమనించి వారిని ఇంట్లో నుంచి బయటకు తీసుకువచ్చి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. అందుబాటులో లేకపోయే సరికి వీరి పరిస్థితిని చూసి చలించిపోయిన గ్రామస్తులు ఒక ఆటోలో వీరిని వెల్దుర్తి సిహెచ్‌సికి తీసుకురాగా అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బండ నాగరాజు భార్య ప్రస్తుతం





5 నెలల గర్బిణీ కావడంతో ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు చెప్పారని బంధువులు తెలిపారు. భర ్త,ఇద్దరు పిల్లల పరిస్థితి సైతం ఇబ్బందికరంగానే ఉందని తెలిసింది. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా గ్యాస్ కంపెనీ వారు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# వైద్యులు పని చేస్తున్నా.. ప్రజెంట్ చేయడం లేదు

**- డీఎంఈ డాక్టర్ రఘునందన్**



**కర్నూలు, హాస్పిటల్ అక్టోబర్ 6 ప్రభాతవార్త :**
ప్రభుత్వ వైద్యులు సమర్థంగా పనిచేస్తున్నా, వారు చేసిన సేవలను సాంకేతికంగా ప్రజెంట్ చేయడంలో లోపాలు ఉన్నాయని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ రఘునందన్ అన్నారు. ప్రతి కేసుకు ఆయుష్మాన్ భారత్ ఐడి నమోదు పూర్తి స్థాయిలో చేయకపోవడం వల్ల వైద్యుల పని కూడా సాంకేతికంగా నమోదు కావడం లేదని పేర్కొన్నారు. సోమవారం స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సందర్శన సందర్భంగా కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఛాంబర్‌లో విభాగాధిపతులతో సమావేశమైన డీఎంఈ, ప్రతి కేసు వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేసి, సాంకేతికంగా అప్లోడ్ చేయాలని వైద్యులకు సూచించారు. వైద్యులు సమయపాలన పాటించి, నిర్దేశిత సమయం వరకు విధుల్లో ఉండాలని ఆయన ఆదేశించారు. కాలేజీలో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ పోస్టుల ఖాళీల జాబితా త్వరగా పంపించాలని, నియామకాలు త్వరలో పూర్తవుతాయని తెలిపారు. సర్జరీ విభాగం ఇప్పటికే లక్ష్యానికి మించి ఫలితాలు సాధించిందని పేర్కొన్న డీఎంఈ, లాప్రోస్కోపిక్ పరికరాల అవసరాన్ని గుర్తించి వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ, ఇక్కడే బోధకుడిగా పనిచేసిన డీఎంఈ డాక్టర్ రఘునందన్ రాష్ట్రస్థాయి పదవిలోకి చేరి తిరిగి కాలేజీకి రావడం కెఎంసీకి గర్వకారణమని తెలిపారు. తదుపరి డీఎంఈని ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్స్, విభాగాధిపతులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంఈ సూపరిండెంట్ డా. వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్స్ డా. సాయి సుధీర్, డా. హరిచరణ్, డా. రేణుకాదేవి, డా. విజయనంద్ బాబు, డా. సింధియా శుభప్రద తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలు జరిగితే సహించేది లేదు

**- తహసీల్దార్ లక్ష్మీనారాయణ**

**హాలహార్వి, అక్టోబరు06, ప్రభాతవార్త;**



రేషన్ బియ్యం పంపిణీలో డీలర్లు అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని తహసీల్దార్ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. సోమవారం సా ్థనిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ జరుగుతుందన్నారు. మండలంలోని 12 వేల రేషన్‌కార్డులు ఉన్నాయని తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో చౌకదుకాణ డీలర్లు రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా చౌకదుకాణాల డీలర్లు రేషన్ బియ్యం పంపిణీలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. రేషన్‌కార్డు లబ్ధిదారులతో బయోమెట్రిక్ వేలిముద్రలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే డీలర్లను తొలగిస్తామని హెచ్చరించారు.

# జీ వీరాపురంలో ఘర్షణ ఇద్దరికి గాయాలు



**కొత్తపల్లె, అక్టోబర్ 6, ప్రభాతవార్తః**
గ్రామ ఆలయాల పూజల విషయంలో ఇరువురు ఘర్షణ పడడంతో ఇద్దరికి గాయాలు అయిన సంఘటన మండల పరిధిలోని జీ వీరాపురం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకుప్రతి యేటా పంటలు బాగరావాలని గ్రామస్థులంతా గ్రామానికి సమీపంలో నల్లమల అడవిప్రాంతంలో వున్న వరదరాజుల స్వామివారికి పూజలు నిర్వహిస్తారు. అయితే అలా వరదరాజస్వామి వద్దకు వెళ్లె ముందు గ్రామంలోని అన్ని ఆలయాల్లో కాయకర్పూరాలు సమర్పించి పూజలు నిర్వహిస్తారు. ఆ సాంప్రదాయంగా సోమవారం గ్రామస్థులంతా కలిసి వరదరాజుల స్వామికి పూజలు చేయాలని నిర్ణయించుకొని గ్రామంలోని ఆలయాల్లో పూజలు నిర్వహించేందుకు వెల్లారు. ముందుగా రామాలయం వద్ద పూజలు నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన శ్రీనివాసచారి అక్కడికి చేరుకొని ముందు తమ ఇంటివద్ద ఉన్న బ్రహ్మంగారి ఆలయంలో పూజలు నిర్వహించాలని గ్రామపెద్దలతో ఘర్షణకు దిగి తన చేతిలో ఉన్న చెక్కబిడిసే ఆయుదంతో గ్రామపెద్ద అయిన రమణారెడ్డి తలపై కొట్టారు. దాంతో తలకు బలమైన గాయం అయింది. అక్కడున్న గ్రామస్తులంతా కలిసి శ్రీనివాసచారికి దేహశుద్ధి చేశారు. దీంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఇద్దరిని 108లో ఆత్మకూరు ప్రభుత్వాసుప త్రికి తరలించగా అక్కడి వైద్యులు రమణారెడ్డిని మెరుగైన చికిత్సకోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

# ప్రధాని పర్యటనపై సమీక్ష..

**: నేడు డిజిపి కర్నూలు పర్యటన**
**: విధుల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలి జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**





**కర్నూలు, అక్టోబర్ 6, ప్రభాతవార్త :**
ఈ నెల 16న భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు కర్నూలు జిల్లాకు రానున్న నేపథ్యంలో, భద్రతా ఏర్పాట్లపై జిల్లా లైజనింగ్ మరియు సెక్టర్ లైజనింగ్ అధికారులతో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం రాత్రి జిల్లా పోలీసు కార్యాలయంలోని వైఎస్ ఆడిటోరియంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా వీవీఐపీలు, డీజీపీ, ఐజీ, డీఐజీ స్థాయి అధికారులు జిల్లాకు రానున్నందున, ప్రతి లైజనింగ్ మరియు సెక్టర్ ఇన్‌ఛార్జ్ అధికారి విధుల పట్ల అత్యంత బాధ్యతతో, అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. రూట్‌లు, పార్కింగ్ ప్రదేశాలు, వసతి సదుపాయాల విషయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎయిర్‌పోర్టు భద్రత, రోడ్డు డైవర్షన్లు, చెక్‌పాయింట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సమన్వయంతో పనిచేయడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. జిల్లాకు సుమారు 6 వేల మంది పోలీసు బలగాలు రానున్నాయని తెలిపారు. అక్టోబర్ 13వ తేదీన బలగాలు రిపోర్ట్ చేసుకుంటాయని, 14వ తేదీన ట్రయల్ రన్ నిర్వహిస్తామని చెప్పారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుండి బస్సుల ద్వారా నన్నూరు టోల్‌ప్లాజా సమీపంలోని రాగమయూరి ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న ప్రధానమంత్రి బహిరంగ సభకు ప్రజలు రానున్నారని తెలిపారు. బస్సు రూట్లలో రోడ్లు దెబ్బతిన్న చోట్ల గుర్తించి మరమ్మతులు చేయాలని, ప్రజలు సురక్షితంగా సభ ప్రాంగణానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రేపు (మంగళవారం) సాయంత్రం రాష్ట్ర డీజీపీ గారు జిల్లాకు వస్తారని, బుధవారం ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తారని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# వికటించిన ఇంజక్షన్.. గాలిలో కలిసిన ప్రాణాలు

**: దర్నా చేస్తున్న మృతుని బందువులు**
**: గుల్లను నయం చేయమంటే ప్రాణమే తీసేశారు**
**: విచారణ చేసి న్యాయం చేస్తాం : కలెక్టరు**








**నంద్యాల, అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి**
వైద్యము వికటించిందని ఇంజక్షన్ నికిలీలని గ్రామీణ ప్రాంతాల్లో వచ్చి రాని అర్ఎంలు అంటే సరే కాని ఏకంగా జిల్లా ఏరియా అసుపత్రిలో వైద్యము వికటించిందంటే వైద్యఆరోగ్యశాఖలో ఎలా ఉందో దీనికి బట్టి చూస్తే ఇట్లే అర్థము అవుతుంది. ఇటీవల సంజామలలో తలనొప్పి అంటు అసుపత్రికి వెల్లితే సూది మందు వేయడము మృతి చెందిన సంఘటలు మరుక ముందు కాలికి గుల్ల ఉందని దానిని నయం చేయాలని జిల్లా ఏరియా అసుపత్రికి వెల్లితే అక్కడు వేసిన సూది మందుతో ఓ వ్యక్తి ప్రాణాలుగాలిలో కలిసి పోయాయి. వివరాలోకి వెల్లితే బనగానపల్లె నియోజక వర్గంలోని కొలిమిగుండ్ల మండలం చెన్నంపల్లె గ్రామానికి చెందిన జంగం రమణ అనే వ్యక్తి గత కొంత కాలంగా కాలిక గుల్ల లేచి నొప్పిని భరించలేక నంద్యాల జిల్లా ఏరియా అసుపత్రికి గత 5 రోజుల క్రితము వెల్లాడు, అపరేషన్ చేయాలనిచెప్పి సోమవారము అతనికి నర్సు సూది మందు వేయడము జరిగింది. అ సూది మందు వేంటనే వికటించి ఏకంగా అతనిప్రాణాలు గాలిలో కలిసి పోయాయి. ఈ సీను చూస్తే ఠాగూరు సినిమాను తలపిస్తుంది. సూది మందు వేసిన వేసిన వెంటనే రమణ మృతి చెందాడని బందువులు అంటున్నారు. కాలికి గుల్ల నయంచేయని వస్తే ఇక్కడ ఏకంగా మాభర్త ప్రాణాలే తీశారని బార్య, బందవులు సోమవారము ఉదయం నుండి అరచి గేపెట్టుతున్న ఎవరు పట్టించుకోలేదు దీనితో బందవులు అసుపత్రిలో దర్నా చేపట్టారు. ఉదయం సాయంత్రము వరకు ఎవరు పట్టించుకోలేదు కాని కేవలము ఔట్ పోస్టులో ఉన్న పోలీసులు వచ్చిన దర్నా అపాలని పలుమార్లు చెబుతున్నారు కాని డాక్టర్లు కాని సూదిమందు వేసిన నర్సులు కాని అటు వైపు తొక్కి చూడలేదని వారు అంటు న్నారు. అసలు సూది మందు అసుపత్రిలో ఉన్న దానిని వేశారా? బయటనుండి తెప్పించి వేశారా అనేదానిపై విచారణ చేస్తే ఏమాటనేది అర్థము అవుతుందవి. అయితే ఎట్టకేలము జిల్లా కలెకర్టరు రాజకుమారి దృష్టికి సమస్య వెల్లడముతో అమె విచారణ చేసి న్యాయం చేస్తామని చెప్పడముతో బందువులు దర్నా విరమించి మృతదేహమును స్వగ్రామానికితీసుకెళ్లారు.

# అంధులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి ; బీసీ రాజారెడ్డి

- గతనెల వరకు 160 మందికి అంధులకు ఒక్కొక్కరికి రూ.500ల చొప్పన పింఛన్
- నేటి నుండి అదనంగా రూ.200 పెంచి 200 మందికి ఒక్కొక్కరికి రూ.700 పింఛన్ పంపిణి



**బనగానపల్లె, అక్టోబర్ 6, ప్రభాతవార్తః**
అంధులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు, సోమవారం స్తానిక బీసీ గుర్రెడ్డి కాలనీలో అంధులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి ఒక్కొక్కరికి రూ.700 చొప్పున బీసీ రాజారెడ్డి పింఛన్లు పంపిణి చేశారు. ముందుగా కీ.శే.బీసీ గుర్రెడ్డి బీసీ లక్ష్మమ్మ దంపతులు కీ.శే.బాలతిమ్మారెడ్డిల చిత్ర పటాలకూ పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్బంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ మాతండ్రి కీ.శే.గుర్రెడ్డి జ్ఞాపకార్థం 2009 అక్టోబర్‌లో అంధులకు పింఛన్ పంపిణి కార్యక్రమం ప్రారంభించామన్నారు. 16 సంవత ్సరాలుగా ప్రతినెల 1వ తేదినే సొంత డబ్బులతో వారికి పెన్షన్ అందిస్తున్నామన్నారు. నేటితో పింఛన్ల పంపిణి కార్యక్రమం 17 సంవత ్సరంలోకి అడుగుపెట్టిందన్నారు. గత నెల వరకు 160 మంది అంధులకు ఒక్కొక్కరికి రూ.500ల చొప్పున పింఛన్ అందించామని నేటి నుంచి అదనంగా రూ.200 పెంచి 200 మందికి ఒక్కొక్కరికి రూ.700చొప్పున పింఛన్లుపంపిణి చేసేందుకు శ్రీకారం చుట్టడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. మా తల్లిదండ్రులు కీ.శే. బీసీ గుర్రెడ్డి, బీసీ లక్ష్మమ్మ దంపతులు మా అన్నదమ్ములను క్రమశిక్షణతో పెంచి మా భవిష్యత్తుకు మంచి బాటలు వేశారన్నారు. వారి రుణం తీర్చుకునేందుకు సేవా కార్యక్రమాలు చేయడం నాకు ఎంతో తృప్తి ఉందన్నారు. అన్నదమ్ములు ఆత్మీయుల ప్రోత్సాహం ఎన్నటికి మరువలేనిది అన్నారు. బనగానపల్లె మారె ్కట్‌యార్డు చైర ్మన్ కాట్రెడ్డి మల్లిఖార్జునరెడ్డి మాట్లాడుతూ కులమతాలకు, ప్రాంతాలకు అతీతంగా బీసీ రాజారెడ్డి ఎన్నోసేవా కార్యక్రమాలుచేస్తు ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేసుకుంటున్నారని ఆయన కొనియాడారు. ఈకార్యక్రమంలో బొబ్బల మహేశ్వర్‌రెడ్డి, రోటరీ క్లబ్ మెంబర్ బలరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ లాడ్జిలో గుండెపోటుతో భక్తుడు మృతి

**- గోప్యత పాటించిన లాడ్జి యజమాని**
**- కేసు నమోదు చేయని పోలీసులు**

**మంత్రాలయం, అక్టోబరు06, ప్రభాతవార్త;**



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం లోని ఓ ప్రైవేట్ లాడ్జిలో ఓ భక్తుడు గుండెపోటుతో సోమవారం మృతిచెందాడు. అయితే ఈ విషయం బయటకు రాకుండా లాడ్జి యజమాని, పోలీసులు గోప్యత పాటించారు. ఎక్కడైనా లాడ్జిలో రూమ్ అద్దెకు ఇవ్వాలంటే ఒక వ్యక్తికి ఇవ్వరు, ఇద్దరు వ్యక్తులకు ఇస్తారు. అయితే ఇక్కడ బన్నీస్ లాడ్జి నిర్వాహకులు మాత్రం ఒకే వ్యక్తికి రూమ్ అద్దెకు ఇచ్చారు. ఆ భక్తుడు రాత్రి సమయంలో గుండెపోటుతో మృతిచెందినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు భక్తుడు సాధారణంగా మృతిచెందాడని, మృతిచెందిన వ్యక్తి బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేయాల్సిన పోలీసులు కేసు నమోదు చేయకుండా వదిలేశారు. సాధారణ ప్రజలు కొట్టుకుంటేనే కేసు నమోదు చేసే పోలీసులు ఓ భక్తుడు మృతి చెందితే మాత్రం ఆ లాడ్జి నిర్వాహకులపై కేసు నమోదు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంపై ఎస్ఐ శివాంజిల్‌ను ప్రభాతవార్త వివరణ కోరగా, సాధారణ మరణంగా భావించి కేసు నమోదు చేయలేదని తెలిపారు.

# ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి.

**: ఆదోని సబ్ కలెక్టర్ మోర్య భరద్వాజ్**

**ఆదోని, అక్టోబరు06, ప్రభాతవార్త;**



పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జిదారులను సంతృప్తిపరిచేలా చూడాలని ఆదోని సబ్ కలెక్టర్ మోర్య భరద్వాజ్ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం నందు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం పిజిఆర్ఎస్ లో సబ్ కలెక్టర్ పాల్గొని డివిజన్లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. .మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువు లోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ ఎల్ ఏ లోకి వెళ్లకుండా చూడాలన్నారు. 1. ఆదోని నుండి పర్వతపురం వరకు రోడ్డు సరిగ్గా లేదని దయతో రోడ్డు మార్గాన్ని మరమత్తులు చేయాలని గ్రామానికి వెంకటేష్ అర్జీ సమర్పించుకున్నారు. 2. పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో బస్టాండ్ నుండి గ్రామ చావడి వరకు సిసి రోడ్ ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన ఎస్ రాజు అర్జీ సమర్పించుకున్నారు. 3. హోళగుంద మండలం ఇంగలదహాల్ గ్రామానికి చెందిన సుశీలమ్మ సంబంధించి గత కొద్ది రోజుల క్రితం నా భర్త అయిన నాగప్ప అనారోగ్యంతో మరణించారు. ప్రస్తుతం నాకు వితంతువు పెన్షన్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మనాభ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఆర్డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మజా, ఆర్టీవో కార్యాలయపు పరిపాలన అధికారి రమాదేవి, ఆర్టీసీ డిపో రఫీ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ మార్కెట్ అవార్డు



**కర్నూలు, అర్బన్ అక్టోబరు06, ప్రభాతవార్త;**
స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ మార్కెట్ అవార్డు లో బాగంగా జిల్లా స్థాయి అవార్డును కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ అసిస్టెంట్ డైరెక్టర్, (జిల్లా వ్యవసాయ వాణిజ్యం మార్కెటింగ్ అధికారి) ఆర్. జయలక్ష్మి కు వరించింది. మార్కెట్ ప్రాంగణంలో పరిశుభ్రత చర్యలు, వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ, పచ్చదనం విస్తరణ వంటి పలు కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలు చేసినందుకు ఈ అవార్డును రాష్ట్ర మంత్రి పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ. భరత్ మరియు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య చేతుల మీదుగా స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ మార్కెట్ అవార్డును ఆర్. జయలక్ష్మి కి ప్రధానం చేశారుఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ –"ఈ అవార్డు నాయకులు, జిల్లా అధికారులు, మా మార్కెట్ యార్డ్ సిబ్బంది, రైతులు, వ్యాపారులు అందరి సహకారంతో సాధ్యమైందనీ. భవిష్యత్తులో మరింత హరిత, స్వచ్ఛ మార్కెట్‌గా అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని" ఈ అవార్డు రావడంతో నాకు మరింత బాధ్యత పెరిగిందని ఈ అవార్డు అందుకోవటానికి కారణమైన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# సహృద్భావంతో మంచి కార్యాలు చేస్తూ ముందుకు సాగాలి.

**: సీఐ శ్రీ రామ్.**



**ఆదోని సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :**
ఆంధ్రా రాష్ట్ర బెస్త సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన రామాంజినేయులు కు వన్ టౌన్ సిఐ శ్రీరామ్ శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బెస్త సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన బెస్త రామాంజినేయులు ఆదోని ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీ రామ్ ని మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది, అనంతరం సీఐ శ్రీ రామ్. రామాంజనేయులు కి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించి ఇలాగే మరిన్ని సేవా కార్యక్రమాల తో బృహత్కరమైన పనులు చేస్తూ ముందుకు సాగాలని సమాజానికి మనం మంచి చేస్తే ఆది ఏదో ఒక రూపంలో తిరిగి వస్తుందనీ సూచించారు.

# ప్రశాంతంగా ముగిసిన దేవరగట్టు బన్ని ఉత్సవాలు



**హొళగుంద, అక్టోబరు06, ప్రభాతవార్త;**
రాష్ట్రంలోనే ఎంతో ప్రసిద్ధిగాంచిన దేవరగట్టు శ్రీ మాల మల్లేశ్వరస్వామి బన్ని ఉత్సవాలు సోమవారం సాయంత్రం శ్రీ మాల మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులు నెరణికి గ్రామానికి చేరడంతో ప్రశాంతంగా ముగిశాయి. గత నెల 27వ తేదీన కంకణధారణతో ప్రారంభమైన శ్రీ మాల మల్లేశ్వరస్వామి బన్ని ఉత్సవాల్లో జైత్రయాత్ర, ఇనుప గొలుసు తెంపుట, కంకణ విసర్జన తదితర కార్యక్రమాలు గత ఐదు రోజుల నుంచి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవమూర్తులు నెరణికి గ్రామానికి చేరుకోవడంతో నెరణికి గ్రామంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హొళగుంద ఎస్ఐ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# మహిళ దారుణ హత్య



**ఆళ్లగడ్డ, అక్టోబర్ 6, ప్రభాతవార్తః** ఆళ్లగడ్డ మండల పరిధిలోని ఆర్ కృష్ణాపురం గ్రామంలో మహిళ హత్యతో దారుణం చోటుచేసుకుంది. ఆదివారం అర్ధరాత్రి దాటిన సమయంలో మేడపై నిద్రిస్తున్న ఓబులమ్మ (40) అనే మహిళను భర్త శేషగిరిరావు ఇటుకలతో తలపై కొట్టి మేడపై నుంచి తోసి హత్యచేసినట్లు ఆళ్లగడ్డ రూరల్ సిఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు. భార్య అక్రమ సంబంధం కలిగి ఉందన్న అనుమానంతో ఈ హత్యకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు.